
అనంతసాగరం (ఆంధ్రజ్యోతి): సోమశిల జలాశయానికి ఎగువ నుంచి వస్తున్న వరద ప్రవాహం తగ్గుముఖం పట్టింది. మంగళవారం 10,929 క్యూసెక్కులు వస్తుండగా బుధవారానికి 8,539 క్యూసెక్కులకు చేరింది. ఇక డ్యాంలో 69.856 టీఎంసీల నీరు నిల్వ ఉండగా, దిగువ డెల్టాకు 2,100, కండలేరుకు 10,000, ఉత్తరకాలువకు 700, దక్షిణ కాలువకు 400 క్యూసెక్కులు సరఫరా చేస్తున్నారు.

● **కండలేరు నీటిమట్టం :** రాపూరు : కండలేరు డ్యాం నీటిమట్టం 48 టీఎంసీలకు చేరింది. ఇన్ ఫ్లో ఏమిలేకపోగా అవుట్ ఫ్లో 1,265 క్యూసెక్కులు ఉందని కండలేరు డ్యాం ఏఈ తిరుమలయ్య ఒక ప్రకటనలో తెలిపారు.

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



5

శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా వార్తలు

గురువారం 7 నవంబరు 2024

వేలం వేసి మరీ...

అనంతసాగరం మండలంలో 3 లైసెన్స్ మద్యం షాపులు ఉండగా, వీటికి అనుబంధంగా బెల్టు షాపులు వెలిశాయి. దాదాపు అన్ని గ్రామాల్లోనూ మద్యం పుష్కలంగా దొరుకుతోంది. పీకేపాడు, పాతదేవరాయపల్లి, ముస్తాపురం, పాతాళపల్లి తదితర గ్రామాల్లో బెల్టు నిర్వహణ కోసం వేలం పాట నిర్వహించినట్లు సమాచారం. త్వరగా తమ పెట్టుబడులు రాబట్టుకోవాలన్న ఉద్దేశంతో మద్యం షాపుల యజమానులు బెల్టు షాపులను ప్రోత్సహిస్తున్నారు. రూ.50 వేల నుంచి లక్ష వరకు వసూలు చేసి మరీ విచ్చలవిడిగా మద్యం సరఫరా చేస్తున్నారు.

- అనంతసాగరం (ఆంధ్రజ్యోతి)

ఊరూరా బెల్టు కిక్కు

'బెల్టు షాపులు తెరిస్తే తాట తీస్తా!' ఇటీవల రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు చేసిన హెచ్చరిక ఇది. అయితే, ఈ హెచ్చరిక అటు అధికారులకు, ఇటు మద్యం వ్యాపారులకు చెవికెక్కినట్టులేదు. వైసీపీ పాలనలో కేవలం బెల్టుషాపులు మాత్రమే ఉంటే కూటమి పాలనలో బెల్టుకు బెల్టుషాపులు వెలుస్తున్నాయి. వెరసి జిల్లావ్యాప్తంగా కిరాణా కొట్లు, టీ దుకాణాలు, కూల్ డ్రింక్ షాపులు.. ఇలా ప్రతి దుకాణంలోనూ నిత్యావసరాలకన్నా మద్యం సీసాలు విచ్చలవిడిగా దొరుకుతున్నాయి. ఆంధ్రజ్యోతి బృందం జిల్లావ్యాప్తంగా పలు మండలాల్లో పరిశీలించగా ఈ విషయం వెలుగుచూసింది.

- నెల్లూరు (ఆంధ్రజ్యోతి)

బరితెగించి.. బెల్టు తీసి!

చైన్ లింకుల్లా మద్యం దుకాణాలు

మద్యం వ్యాపారంతో ప్రభుత్వాలు నడపడం అనైతికం. అని మహాత్మా గాంధీ అన్నారు. అయితే అధికారం కోసం లెక్కకు మించిన సంక్షేమ పథకాల వల్ల ప్రభుత్వాలు మందు ఆదాయం లేకపోతే ఒక్కరోజు కూడా తట్టుకోలేని స్థితికి చేరుకున్నాయి. ప్రభుత్వాల నిస్సహాయతను అలుసుగా తీసుకొని మద్యం వ్యాపారులు చెలరేగిపోతున్నారు. అధికార పార్టీ నాయకులు వారికి వెన్నుదన్నుగా నిలుస్తున్నారు. ఇంకేముంది బెల్టు తెరిస్తే తోలు తీస్తానన్న ముఖ్యమంత్రి హెచ్చరికలు పెద్ద జోక్‌గా మారిపోయాయి. గతంలో ఎప్పుడూ లేనంతగా మద్యం వ్యాపారంలో అధికార పార్టీ నేతలు వేలు పెట్టడంతో ఊరికి దూరంగా ఉండాల్సిన మద్యం ఇళ్ల మధ్యలో ఉన్న కిరాణా షాపుల్లోకి చేరింది. మద్యం వ్యాపారులు, వీరి లాభాల్లో వాటాలు ఫిక్స్ చేసుకున్న రాజకీయ నాయకులు కరువున పడ్డట్టు మద్యం సీసాలను నట్టింటికి చేరుస్తున్నారు.

● **ఒకటికి 20 షాపులు**

మద్యం షాపు యజమాని తన షాపు పరిధిలో పదికి తక్కువ లేకుండా బెల్టుషాపులకు సరుకు సరఫరా చేస్తున్నాడు. గ్రామాల్లో ఎవరికి బెల్టు షాపు ఇవ్వాలో ఆ మండల రాజకీయ పార్టీ నాయకుడు నిర్ణయిస్తున్నాడు. నాయకులు చెప్పిన వారు మాత్రమే బెల్టుషాపులు తెరుస్తున్నారు. ఆ ఊరిలోని లైసెన్స్డ్ మద్యం షాపు యజమాని క్వార్టర్ మీద 10 నుంచి 20 రూపాయలు అధికంగా బెల్టు షాపునకు సప్లయ్ చేస్తున్నాడు. ఆ బెల్టు షాపు నిర్వాహకుడు తన పరిధిలోని మరో పది మందికి సరుకు సప్లయి చేసి మందు అమ్మిస్తున్నాడు. ఈ క్రమంలో టీ దుకాణాలు, కూల్‌డ్రింక్ షాపులు, కిరాణా షాపులు.. చివరికి మత్తు వ్యాపారంలో పోటీదారు అయిన కల్లు దుకాణాల్లోనూ మద్యం ఉంచి విక్రయిస్తున్నారు. ఇలా ఒక మద్యం షాపు యజమాని తన పరిధిలో బెల్టు పేరుతో 10 మందికి సరుకు సప్లయ్ చేస్తుంటే.. ఆ బెల్టు నిర్వాహకుడు తన పరిధిలో మరో పది మందికి సరుకు ఇచ్చి మినీ బెల్టు షాపులు నడుపుతున్నాడు. అంటే ప్రభుత్వం ఒక మద్యం దుకాణానికి లైసెన్సు ఇస్తే, సదరు వ్యాపారి 20 దుకాణాల ద్వారా మద్యం విక్రయించుకొంటున్నాడు. వీటిపై చర్యలు తీసుకోవాల్సిన ఎక్సైజ్ అధికారులు మామూళ్ల ఫిక్సేషన్‌లో బిజీగా ఉన్నారు. ఏ షాపు నుంచి ఎంత తీసుకోవాలి.. అన్ని షాపులు కలిపితే ఎంత వస్తుంది? అందులో ఏ స్థాయి అధికారి వాటా కింద ఎంత మిగులుతుంది! అని లెక్కలేసుకొంటున్నారు. మద్యం షాపు యజమానులతో మామూళ్ల విషయంలో బేరసారాలు సాగిస్తూ విధి నిర్వహణను బెల్టుషాపులకు వదిలేశారు.

ఆంధ్రజ్యోతి పరిశీలన

ఆంధ్రజ్యోతి పరిశీలనలో..

● **ఏఎస్ పేట :** మండలంలో రెండు లైసెన్స్ దుకాణాలు ఉండగా, బెల్ట్‌షాపులు 20కిపైగా ఉన్నాయి. లైసెన్స్‌దారుల నుంచి ఒక్కో బాటిల్‌ను రూ.5-10 అదనంగా తీసుకుంటున్న బెల్టు నిర్వాహకులు రూ.20-50కి అదనంగా విక్రయిస్తున్నారు. ఇక డోర్ డెలివరీ అంటే అదనంగా వంద రూపాయల వరకు ఇచ్చుకోవాలి.

● **సంగం :** మండలంలో 20 పంచాయతీలు, 30 గ్రామాలు ఉండగా మూడు లైసెన్సు మద్యం దుకాణాలు ఉన్నాయి. బెల్టు దుకాణాలు మాత్రం గ్రామానికి 2, 3 లెక్కన సుమారు 70కిపైగా ఉన్నాయి. మండల కేంద్రమైన సంగంలో బస్టాండ్‌లో నాలుగు బెల్టుషాపులు ఉన్నాయి.

● **కలువాయి :** మండలంలో 2 మద్యం దుకాణాలు ఉండగా, అన్ని గ్రామాల్లో పోటాపోటీగా బెల్టుషాపులు ఏర్పాటు చేశారు. ఎమ్మార్పీ కంటే రూ.20 నుంచి 30 వరకు అదనంగా విక్రయిస్తున్నారు. మద్యం దుకాణ యజమానులకు అనుకూల వ్యక్తులకే బెల్టుషాపు నిర్వహణ బాధ్యతలు ఇచ్చారు.

● **కోవూరు :** మండలంలోని అన్ని గ్రామాల్లో లైసెన్స్‌దారులు బెల్టు దుకాణాలు ఏర్పాటు చేశారు. రాత్రి పది నుంచి ఉదయం పది గంటల వరకు క్వార్టర్ సీసాపై రూ.30 నుంచి 50లకు అదనంగా విక్రయిస్తున్నారు. అధికార పార్టీ నాయకుల అండదండలు ఉన్న వ్యక్తులకే బెల్టుషాపులు దక్కాయి. వీరి నుంచి లైసెన్స్‌దారులు రూ.25 వేలు వసూలు చేసినట్లు సమాచారం.

● **కావలి రూరల్ :** అధికార పార్టీ నేతల అండతో మండలంలో సుమారు 50 నుంచి 60 బెల్టు షాపులు వెలిశాయి. అంతేగాక సీసాపై అదనంగా రూ.50-70 వరకు విక్రయిస్తున్నారు.


కలిగిరి : మండలంలో మూడు అధికారిక మద్యం షాపులు ఉంటే ప్రతి గ్రామంలో 2, 3 బెల్టుషాపులు తెరుచుకున్నాయి. ఇవి లేకపోతే మద్యం విక్రయాలు అనుకున్నంత జరగవని వ్యాపారులు అంటున్నారు.

● **కొండాపురం :** మండలంలోని 19 పంచాయతీల్లో 50కిపైగా బెల్టు దుకాణాలు ఉన్నాయి. ఎక్సైజ్ అధికారులు కూడా చూసీ చూడనట్టు వ్యవహరిస్తుండటంతో వ్యాపారులదే ఇష్టారాజ్యమైంది.

● **జలదంకి :** గత ప్రభుత్వంలో గ్రామాల్లో అనధికారికంగా మద్యం విక్రయించనవారే ఇప్పుడూ అమ్ముతున్నారు. మండలవ్యాప్తంగా బెల్టు షాపులు వెలిశాయి.

● **అల్లూరు :** మండలంలో 23 బెల్టుషాపులు ఉండగా వాటికి మద్యం షాపుల నుంచి బాటిళ్లు అధిక మొత్తంలో సరఫరా అవుతున్నాయి. పల్లెల్లో సైతం మద్యం సులభతరంగా లభ్యమయ్యేలా వ్యాపారులు బెల్టుషాపులను ప్రోత్సహిస్తున్నారు.

● **బుచ్చిరెడ్డిపాళెం :** తలుపులు తెరిస్తే లైసెన్స్ దుకాణం, మూస్తే బెల్టు దుకాణం అన్న రీతిలో వ్యాపారులు మద్యం విక్రయాలు జరుపుతున్నారు. నిబంధనల ప్రకారం ఉదయం 10 నుంచి రాత్రి 10గంటల వరకు మద్యం దుకాణాలు నిర్వహించాలి. అయితే కొంతమంది వ్యాపారులు దుకాణాల పక్కనే కూల్‌డ్రింక్ షాపులు ఏర్పాటు చేసి అర్ధరాత్రి తర్వాత కూడా మద్యం విక్రయాలు జరుపుతున్నారు. ఇందుకుగాను రూ.30-50 వరకు వసూలు చేస్తున్నారు.





ఎమ్మార్పీ కంటే ఎక్కువే

మండల కేంద్రమైన వరికుంటపాడులో అధికారికంగా మద్యం దుకాణం లేదు. దీంతో ఇతర ప్రాంతానికి చెందిన దుకాణదారులు అక్కడ ఓ మనిషి ద్వారా మద్యం విక్రయిస్తున్నట్లు తెలిసింది. కొంతమంది స్థానికంగా అమ్మకాలు జరుపుతుంటే, ఇంకొంతమంది ఆటోలు, బైకులపై సరఫరా చేస్తూ జేబులు నింపుకుంటున్నారు. దుకాణదారులు ఒక్కో సీసాపై రూ.30 అదనంగా ధర నిర్ణయించగా మిగిలిన వారు రూ.50 వరకు వసూలు చేస్తున్నారు. ఇస్కపల్లి, కాంచెరువు, గువ్వాడి, తూర్పుబోయమడగల, తిమ్మారెడ్డిపల్లి, తూర్పుకొండారెడ్డిపల్లి, తూర్పురొంపిదొడ్ల, గణేశ్వరాపురం, నారసింహాపురం, విరువూరు, పెద్దిరెడ్డిపల్లి తదితర గ్రామాల్లోనూ బెల్టు షాపులు విచ్చలవిడిగా వెలిశాయి.

- వరికుంటపాడు (ఆంధ్రజ్యోతి)

కందుకూరులో పోటాపోటీగా..

కందుకూరు (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గంలో మొత్తం 17 లైసెన్స్ మద్యం దుకాణాలు ఉన్నాయి. అయితే, ఆయా మండలాల పరిధిలోని వ్యాపారులు బెల్టుషాపులకు తమ దుకాణం నుంచి మద్యం సరఫరా చేస్తున్నారు. దీంతో లైసెన్స్ దుకాణదారుల మధ్య పోటీ కారణంగా ఒక్కో గ్రామంలో 3, 4 మద్యం బెల్ట్‌షాపులు కూడా వెలుస్తున్నాయి. నియోజకవర్గ వ్యాప్తంగా 200 వరకు బెల్ట్ దుకాణాలు ఏర్పాటైనట్లు సమాచారం. ప్రత్యేక వాహనాల్లో బెల్ట్‌షాపులకు మద్యం చేరవేసి క్వార్టర్‌కు రూ.10-15 అదనంగా వసూలు చేస్తున్నారు. ఇక బెల్టుషాపుల్లో క్వార్టర్‌కు రూ.30 నుంచి రూ.50వరకు అదనంగా వసూలు చేస్తున్నారు.

● **తీరప్రాంతాల్లో వేలం**

తీరప్రాంత గ్రామాలలో బెల్ట్ నిర్వహణ హక్కుల కోసం గ్రామపెద్దలు వేలం నిర్వహించటం విశేషం. ఆ గ్రామాలలో బెల్ట్ దుకాణం నడిపే హక్కు ఒకరికే ఉంటుంది. ఆ హక్కును ఇద్దరు ముగ్గురు కలిసి పొందినా రెండు మూడుచోట్ల ఏర్పాటు చేసుకున్నా వారి ఆధీనంలోనే బెల్ట్‌ల నిర్వహణ జరగాలే తప్ప మరొకరు ఏర్పాటు చేయడానికి వీల్లేదు. వేలంలో వచ్చిన సొమ్మును గ్రామపెద్దలు గ్రామాభివృద్ధికి ఉపయోగిస్తారు. ఈ నిబంధన ప్రకారం వేలంలో రూ.లక్షలకు లక్షలు వెచ్చించి బెల్ట్ హక్కులను పొందటం విశేషం. ఉలవపాడు మండలం అలగాయపాలెంలో బెల్ట్‌షాపు ఏర్పాటుకు నిర్వహించిన వేలం పాట రూ.8లక్షలు పలకగా మిగిలిన గ్రామాల్లోను ఈ మొత్తం రూ.లక్షల్లోనే ఉన్నట్లు సమాచారం.



కొనితెచ్చుకుంటున్న కేన్సర్!!

నేటి సమాజంలో కేన్సర్ వ్యాధి మహమ్మారిలా మారుతోంది. ఎంతో మంది ప్రాణాలను కబళిస్తోంది. మారుతున్న ఆహారపు అలవాట్లు, జీవన శైలి, వంశపారపర్యం తదితర కారణాలతో కేన్సర్ వ్యాధి సోకుతోంది. ముఖ్యంగా ధూమపానం, మద్యంపానం, ఇన్‌స్టంట్, జంక్ ఫుడ్, కల్తీ నూనెలు, కాలుష్యం వంటి వల్ల కేన్సర్‌ను కొనితెచ్చు కుంటున్నారు. ఈ వ్యాధిని ప్రాథమిక దశ లోనే గుర్తిస్తే పూర్తిగా నయం చేయవచ్చని వైద్య నిపుణులు చెబుతు న్నప్ప టికీ అవగాహన లోపంతో, సరైన వైద్యం అందక చాలా మంది వయసుతో సంబంధం లేకుండా మృత్యువుకు చేరువవుతున్నారు. ఈ నేపథ్యంలో ఏటా నవంబరు 7వ తేదీన జాతీయ కేన్సర్ అవగాహన దినం నిర్వహించాల ని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది.


6

ఉచిత ఇసుకకు ఆన్‌లైన్‌లో నమోదు తప్పనిసరి

ఇసుక తరలించే వాహనాల వద్ద రశీదు ఉండాల్సిందే

లేకుంటే ఇకపై కేసులు : కలెక్టర్

నెల్లూరు (వెంకటేశ్వరపురం), నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : ఉచిత ఇసుక ఆన్‌లైన్‌లో తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని, తరలించే వాహనదారుల వద్ద కూడా రశీదు ఉండాలని కలెక్టర్ ఆనంద్ ఒక ప్రకటనలో తెలిపారు. జీవో నెం.66లో మార్పులకు అనుగుణంగా నిబంధలు పాటించాలని సూచించారు. అలాగే, ఇసుక రవాణా వాహనానికి తప్పనిసరిగా జీపీఎస్ ఏర్పాటు చేసుకోవాలని ఆదేశించారు. గ్రామాల్లో సైతం ఇసుక కోసం స్థానిక సచివాలయం వద్ద దరఖాస్తు చేసుకొని ఉచిత ఇసుక కూపన్‌ను పొందాలని తెలిపారు. గ్రామంలో జరిగే నిర్మాణాలకు మాత్రమే ఉచిత ఇసుక తరలించుకోవాలని, ఇతర ప్రాంతాలకు తరలిస్తే కఠిన చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. అదేవిధంగా అధిక మొత్తంలో ఇసుక కావాలన్న వారు ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఇసుక స్టాక్ పాయింట్ వద్ద లోడింగ్ చార్జీలు చెల్లించి తీసుకెళ్లవచ్చని తెలిపారు.



మెగా ఇండస్ట్రియల్ హబ్ మ్యాప్

జిల్లాలో మెగా ఇండస్ట్రియల్ హబ్

● రామాయపట్నం పోర్టుని అనుకొని ఏర్పాటు

● భూసేకరణకు మూడు గ్రామాల గుర్తింపు

● రెవెన్యూశాఖకు బాధ్యత అప్పగింత

● 2001 ఎకరాల్లో అంతర్జాతీయ పరిశ్రమలు

నెల్లూరు (వెంకటేశ్వరపురం), నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో రామాయపట్నం పోర్టుని అనుకొని మెగా ఇండస్ట్రియల్ హబ్ ఏర్పాటు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ముమ్మర ప్రయత్నాలు ప్రారంభించింది. ఆ పోర్టు పనులు ఇప్పటికే 80శాతం పూర్తి కావడంతో దానికి అనుసంధానంగా అనేక అంతర్జాతీయ పరిశ్రమల ఏర్పాటుకు కృషి చేస్తోంది. ఇందుకోసం రామాయపట్నాన్ని అనుకొని ఉన్న మూడు గ్రామాల భూముల్లో మెగా ఇండస్ట్రియల్ హబ్ ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేసింది. అంతర్జాతీయం గా పేరొందిన హిందుస్థాన్ పెట్రోలియం రిఫైనరీ, ఇండోసోల్ సోలార్, జాన్సన్ ఇన్‌ఫ్రా, జేఎస్‌డబ్ల్యూ లిమిటెడ్ వంటి అనేక సంస్థలు ఇక్కడ పరిశ్రమలు నెలకొల్పేందుకు ముందుకొస్తున్నాయి.

రెవెన్యూకు ఏపీఐఐసీ ప్రతిపాదనలు

కావలి మండల పరిధిలోని చెన్నాయపాళెం, ఆనేమడుగు, తుమ్మలపెంట గ్రామాల పరిధిలో మెగా ఇండస్ట్రియల్ హబ్ ఏర్పాటుకు ఏపీఐఐసీ ప్రతిపాద నలు తయారు చేసి రెవెన్యూ శాఖకు, రాష్ట్ర ప్రభుత్వానికి పంపింది. ఈ హబ్ ఏర్పాటుకు దాదాపు 3వేల ఎకరాలు కావాల్సి ఉండగా ముందుస్తుగా 2001.78 ఎకరాల సేకరణకు

- మిగతా 6లో

మెగా ఇండస్ట్రియల్ హబ్‌కు ప్రతిపాదించిన భూముల వివరాలు

గ్రామం	పట్టాభూమి	అసైండ్	సీజేఎస్ఎఫ్
చెన్నాయపాళెం	986.24	445.28	163.67
ఆనేమడుగు	4.33	153.96	3.56
తుమ్మలపెంట	----	16.61	228.13
	990.57	615.85	395.36



టీటీడీ పాలకమండలి సభ్యురాలిగా కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి బుధవారం ప్రమాణస్వీకారం చేశారు. తిరుమలలోని శ్రీవారి ఆలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి తదితర ప్రముఖులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వేమిరెడ్డి దంపతులకు ఈవో శ్యామలారావు శ్రీవారి ప్రసాదాలను అందజేశారు.

మీ ప్రయాణానికి మా బహుమతి!



లక్కీ డిప్ విజేతకు బహుమతి ఇస్తున్న డీఎం షేక్ ఖరీమున్నీసా

'మా సంస్థ బస్సుల్లో ప్రయాణించండి. మేము ఇచ్చే బహుమతి అందుకోండి.' అంటున్నారు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (ఏపీఎస్ ఆర్టీసీ) అధికారులు. ఆత్మకూరు నుంచి సోమశిల రూట్‌లో పల్లెవాసులను ఆకర్షించేందుకు అధికారులు లక్కీడిప్ ఏర్పాటు చేశారు. బస్సులో ప్రయాణించిన ప్రజలు తమ టికెట్ మీద పేరు, చిరునామా, ఫోన్ నెంబరు రాసి ఓ బాక్సులో వేయాలి. ఇలా పదిహేను రోజులకోసారి బాక్సును తెరిచి, లక్కీడిప్ ద్వారా విజేతలను ఎంపిక చేస్తారు. ఇలా బుధవారం జరిగిన లక్కీడిప్‌లో ప్రదీప్ విజేతగా నిలిచారు. ఈయనకు ఆత్మకూరు డిపో మేనేజరు షేక్ ఖరీమున్నీసా బహుమతి అందజేశారు. ప్రయాణికులను ఆకర్షించేందుకే ఈ లక్కీ డిప్ ఏర్పాటు చేసినట్లు డీఎం చెప్పుకొచ్చారు.

- ఆత్మకూరు (ఆంధ్రజ్యోతి)

వానొస్తే మునకే!



వీఆర్సీ కూడలిలో..



హరనాథపురం రోడ్డుపై వర్షపునీటిలో కలిసిన మురుగు

మోస్తరు వర్షం కురిస్తే చాలు నెల్లూరు నగరరోడ్లు, లోతట్టు ప్రాంతాలు చెరువులను తలపిస్తున్నాయి. బుధవారం తెల్లవారుజామున కురిసిన వర్షానికి రైల్వే అండర్ బ్రిడ్జిలలో నీరు నిల్వ ఉండటంతో వాహనదారులు అవస్థలు పడ్డారు. అలాగే గుంతల రోడ్లపై నీరు నిలిచి చెరువుల్లా మారాయి.

- స్టాఫ్ ఫొటోగ్రాఫర్ (నెల్లూరు, ఆంధ్రజ్యోతి)



ఆత్మకూరు బస్టాండు వద్దనున్న రైల్వే అండర్ బ్రిడ్జిలో నీరు ఉండటంతో వాహనదారుల అవస్థలు

మా గొప్ప టీచర్ !

- ఉపాధ్యాయుడిగా భీమేశ్వరరావు రాణింపు
- పేదలను ఆదుకుంటూ.. పలువురి నుంచి మన్ననలు
- సేవే ప్రవృత్తిగా సాగుతూ ఆదర్శ జీవితం

ఎంతోమంది ధనవంతులు ఉన్నా... సమాజంలో పేదలను ఆదుకునేందుకు ముందుకు వచ్చేవారు చాలా అరుదుగా చూస్తుంటాం. అలా వచ్చిన కూడా ఏడాదిలో ఓ సారి సాయంచేసి మమ అనిపించు కుంటారు. ఓ ప్రభు త్వ ఉపాధ్యాయుడు మాత్రం కొన్నేళ్లు గా పాఠశాల విద్యార్థులను ఆదుకుంటూ, అటు తల్లిదండ్రులతోపాటు, ఇటు తోటి ఉపాధ్యాయుల మన్ననలు పొందుతున్నాడు. ఆయనే కొండాపురం మండలం కొమ్మి గ్రామానికి చెందిన కొండూరు భీమేశ్వర రావు. మండలంలోని అగ్రహారంలో ఉపాధ్యాయుడిగా పని చేస్తూనే పలువురికి ఆదర్శంగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

-కొండాపురం, (ఆంధ్రజ్యోతి)



ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న భీమేశ్వరరావు (ఫైల్)

సమాజంలోని ప్రజల్లో అజ్ఞానాన్ని తొలగించి, విజ్ఞానం నింపాలంటే అది ఒక్క ఉపాధ్యాయుడికే సాధ్యమవుతుంది. మానవసేవే మాధవసేవ.. అంటూ తాను ఎక్కడున్నా సేవామార్గంలోనే పయనించాలనే తలంపుతో వివిధ రకాల దాతృత్వ సేవలు కొనసాగిస్తున్నారు భీమేశ్వరరావు. గత 14 ఏళ్లుగా సొంత నగదు రూ లక్షల్లో ఖర్చుచేసి మండల పరిధిలోని అన్ని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లోని విద్యార్థులకు అవసరమైన వసతులను సమకూర్చుతున్నారు.

విద్యకు దూరం కారాదు..

విద్యాభ్యాస సమయంలో తన మిత్రులు పలువురు ఆర్థిక కారణాలతో మధ్యలోనే చదువు ఆపివేశారు. అలా ఎవరికీ జరగకూడదని భీమేశ్వరరావు భావించారు. సామాన్య రైతు కుటుంబంలో పుట్టి ప్రభుత్వ పాఠశాల్లోనే విద్యాభ్యాసంచేసి 2002లో ప్రభుత్వ ఉద్యోగం సాధించారు. అప్పటి నుంచి తన సొంత నగదుతో పేద విద్యార్థులకు పలు విధాలుగా సాయం చేయడం మొదలుపెట్టారు. మండలంలోని అగ్రహారం ఎంపీపీ ప్రాథమిక పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న భీమేశ్వరరావు విద్యకు దూరమయ్యే విద్యార్థులను గుర్తించి వారిని ఆదుకుంటున్నారు. వారికి అవసరమైన విద్యా ఉపకరణలు అందచేసి తన దాతృత్వాన్ని చాటుకున్నారు.. పాఠశాలలకు అవసరమైన ఫ్యాన్లు, చిన్నపాటి మరమ్మతులకు ఆయా పాఠశాలల ఉపాధ్యాయుల కోరిక మేరకు సాయం చేస్తున్నారు. క్రీడలలో రాణిస్తున్న వారిని ప్రోత్సహించి, రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీలలో విజయం సాధించేందుకు తోడ్పడుతున్నారు. అలాగే కరోనా సమయంలోనూ క్వారంటైన్‌లో ఉన్న పేషంట్లకు పండ్లు, రొట్టెలు అందచేశారు.

కల్యాణాలకు ప్రోత్సాహం

స్వగ్రామం కొమ్మిలోని ఎస్సీ, ఎస్టీ కుటుంబాల్లో జరిగే కల్యాణాలకు సొంత నిధులతో తాళి బొట్లు చేయించి అందచేస్తున్నారు. అంతేకాక పలు కార్పొరేట్ వైద్యశాలల్లో విధులు నిర్వహించే ప్రముఖ వైద్యులతో గ్రామాల్లో వైద్య శిబిరాల ఏర్పాటుకు సహాయ సహకారాలు అందిస్తున్నారు. పేదలకు చేస్తున్న సేవలకు గుర్తింపుగా 2016లో నెల్లూరులో జరిగిన కార్యక్రమంలో ప్రముఖ సినీ గాయకుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం చేతుల మీదుగా బిందు మీనన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అవార్డు, సత్కారం పొందారు.



విద్యార్థులకు విద్యా ఉపకరణలు అందచేస్తున్న దాత భీమేశ్వరరావు

నిరంతరం సేవలు అందిస్తా...



ఉపాధ్యాయుడిగా పదవీ విరమణ పొందిన అనంతరం కూడా పేద విద్యార్థులకు సేవలందిస్తా. పేద పిల్లలను ఆదుకోవడం నాకు ఎంతో సంతోషాన్నిస్తుంది. వివిధ ఫౌండేషన్ల ద్వారా పేద విద్యార్థులకు సహాయం అందించేందుకు నా వంతు కృషిచేస్తా.

-కొండూరు భీమేశ్వరరావు

• విద్యార్థులపై కక్ష సాధింపా?



బుచ్చి ఎస్సీ హాస్టల్లో మధ్యాహ్నం 2 గంటలకు స్కూలు నుంచి వచ్చి నిద్రపోతున్న విద్యార్థులు

బుచ్చిరెడ్డిపాళెంలోని ఎస్సీ హాస్టల్లో విద్యార్థులపై వాచ్‌మన్ కక్ష సాధింపునలకు పాల్పడ్డారన్న ఆరోపణ ఆశ్చర్యపరుస్తోంది. ఈ హాస్టల్‌కు మంగళవారం సాంఘిక సంక్షేమశాఖ ఇన్‌చార్జ్ డీడీ శ్రీనివాసరావు బుచ్చిలోని డీఎల్ఎన్ఆర్ హైస్కూలు పక్కనే ఉన్న ఎస్సీ హాస్టల్‌కు సాధారణ తనిఖీకి వచ్చినప్పుడు వాచ్‌మన్‌పై విద్యార్థులు ఫిర్యాదు చేశారు. గుడ్లు, పాలు సరిగా ఇవ్వడంలేదనీ చెప్పారు. ఈ క్రమంలో వార్డెన్‌తో పాటు నైట్‌డ్యూటీ వాచ్‌మన్‌ని డీడీ మందలించి వెళ్లారు. దీనితో ఆయన బుధవారం తెల్లవారుజామున 3గంటలకే విద్యార్థులను నిద్రలేపేసి ఇబ్బందిపెట్టాడని విద్యార్థులు ఆరోపిస్తున్నారు. నిద్రమత్తులో ఉదయం పాఠశాలకు వెళ్లిన విద్యార్థులు కొంతమంది నిద్రచాలక మధ్యాహ్నం 2 గంటలకే స్కూలు నుంచి హాస్టల్‌కు వచ్చి నిద్రపోయారు. వాచ్‌మన్ తరచూ ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆవేదన చెందుతున్నారు.

- బుచ్చిరెడ్డిపాళెం(ఆంధ్రజ్యోతి)

ఉపాధ్యాయ రెసిడెన్షియల్ శిక్షణ రద్దు చేయాలి : బీటీఏ

నెల్లూరు(విద్య), నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : ఉపాధ్యాయులకు నిర్వహిస్తున్న ఎఫ్ఎల్ఎన్, లీడర్‌షిప్ రెసిడెన్షియల్ శిక్షణను వెంటనే రద్దు చేయాలని బీటీఏ జిల్లా అధ్యక్షకార్యదర్శులు మణిసుబ్బు, మాసా ప్రసాద్ ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. కొన్నేళ్లుగా ఉపాధ్యాయులు అనేక రకాల యాప్‌లతో సతమతమవుతూ మానసికంగా, శారీరకంగా ఇబ్బందులు పడుతున్నారన్నారు. తాజాగా రెసిడెన్షియల్ ట్రైనింగ్‌లో ఆపార్, యుడైస్‌ప్లస్, టెస్ట్ పీజులు, నామినల్ రోల్స్ తదితర పనులతో తీవ్రమైన ఒత్తిడికి గురవుతూ అనారోగ్యం పాలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను రాష్ట్ర ప్రభుత్వం నెరవేర్చలేదని ఆరోపించారు. వెంటనే స్పందించి ఉపాధ్యాయ సమస్యలను పరిష్కరించాలని కోరారు.

ప్రీస్కూల్ హాజరు పెంచండి

- ఐసీడీఎస్ పీడీ హేనా సుజన్
- అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆకస్మిక తనిఖీ



అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లలతో ఐసీడీఎస్ పీడీ హేనాసుజన్, సీడీపీవో లక్ష్మీదేవి

నెల్లూరు(హరనాథపురం), నవంబరు 6 : అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రీస్కూల్ పిల్లల హాజరు తక్కువగా ఉందని, హాజరు శాతాన్ని పెంచాలని సూపర్‌వైజర్లను, అంగన్ వాడీ కార్యకర్తలను ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ హేనా సుజన్ ఆదేశించారు. ఆమె బుధవారం నగరంలోని పలు అంగన్‌వాడీ కేంద్రాలను నెల్లూరు సీడీపీవో లక్ష్మీదేవితో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. బాలాజీనగర్ సెక్టార్‌లోని చింతారెడ్డిపాళెం-జనరల్, చింతారెడ్డిపాళెం ఎస్సీ-2 అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించారు. ప్రీస్కూలు పిల్లలు నూరు శాతం అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చేలా చర్యలు తీసుకోవాలని సిబ్బందిని హెచ్చరించారు. కేంద్రాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, చిన్నారులకు కాచి చల్లార్చిన మంచి నీరు ఇవ్వాలని ఆదేశించారు. పిల్లలు భోజనానికి ముందు చేతులు పరిశుభ్రంగా కడు క్కునేలా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్ వైజర్ ఎం నాగేశ్వరి, కార్యకర్తలు పాల్గొన్నారు.

అర్చకుల్లో ఆనందం

- రూ.15వేల వేతనం : 109 మందికి ప్రయోజనం
- ధూపదీప నైవేద్యం వారికి రూ.10వేలు
- రాష్ట్ర ప్రభుత్వ ప్రకటనపై హర్షాతిరేకాలు

నెల్లూరు (సాంస్కృతికం), నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని పలు ఆలయాల్లో పనిచేస్తున్న అర్చక స్వాముల కళ్లల్లో ఆనందం వెల్లివిరుస్తోంది. రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ యువగళం పాదయాత్రలో ఇచ్చిన హామీని ప్రభుత్వం అమలులోకి తెస్తోంది. రూ.50వేల నుంచి రూ.5లక్షలలోపు ఆదాయం కలిగిన ఆలయాల్లో పని చేసే అర్చకులకు కనీస వేతనం రూ.15వేలు చెల్లిస్తామని బుధవారం రాష్ట్ర దేవదాయ, ధర్మదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ప్రకటించారు. దీంతో కూటమి ప్రభుత్వానికి జిల్లాలోని అర్చకులు కృతజ్ఞతలు చెబుతున్నారు. ధూపదీప నైవేద్యాలకు నోచుకొని దాదాపు 311 ఆలయాల అర్చకులకు గత ప్రభుత్వం రూ.5వేలు ఇస్తుండగా ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఆ మొత్తాన్ని రూ.10వేలకు పెంచింది. పెంచిన మొత్తాన్ని బకాయిలతో కలిసి బుధవారం నేరుగా అర్చకుల బ్యాంకు ఖాతాకు జమ చేసింది. దీంతో అర్చకులు రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకి కృతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వ నిర్ణయంతో జిల్లాలో 109 మంది అర్చకులకు ప్రయోజనం చేకూరనుంది.

అర్హుల గుర్తింపు : ఏసీ



దేవదాయ శాఖ పరిధిలోని ఆలయాల్లో పనిచేస్తున్న అర్చకులకు కనీస వేతనం రూ.15వేలు చేయాలని ప్రభుత్వం సంకల్పించింది. దీనికోసం రాష్ట్ర వ్యాప్తంగా సర్వే చేసి అర్హులైన అర్చకులను గుర్తించడం జరుగుతుంది.

- కే జనార్దన్ రెడ్డి, దేవదాయ ధర్మాదాయ శాఖ కమిషనర్

కూటమి ప్రభుత్వానికి ధన్యవాదాలు



ధూపదీప నైవేద్యం కింద రూ.5వేలు పొందుతున్న అర్చకులకు ఆ మొత్తాన్ని రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం రూ.10వేలకు పెంచడం ఆనంద దాయకం. రూ.50వేల నుంచి రూ.5లక్షలలోపు వార్షికఆదాయం ఉన్న ఆలయాల అర్చకులకు ఇచ్చే జీతాన్ని రూ.15వేలకు పెంచడం హర్షణీయం. ప్రభుత్వానికి కృతజ్ఞతలు. భగవంతుని ఆశీస్సులు ఉండాలని కోరుకుంటున్నాం.

- ఉదయగిరి వెంకట శేషాచార్యులు, ప్రధాన కార్యదర్శి, జిల్లా అర్చక సమాఖ్య

వెలుగులు నింపారు



ధూపదీప నైవేద్యం కింద ఆలయాల అర్చకులకు ఇస్తున్న రూ.5వేలను రూ.10వేలకు పెం చడం అభినందనీయం. అలాగే తక్కువ ఆదాయం ఉన్న ఆల యాల అర్చకులకు రూ.15వేల జీతం ప్రకటించి అర్చక కుటుంబాల్లో దీపకాం తులు నింపారు.

- వేదగిరి రామకృష్ణమాచార్యులు, కట్టుబడిపాలెం ఆలయం అర్చకుడు

ప్రభుత్వానికి ఆశీస్సులు



నేను ఇందుకూరుపేట మండలం కొత్తూరులోని చంద్రమౌళీశ్వరస్వామి ఆలయంలో అర్చకుడిగా పనిచేస్తున్నా. మా ఆలయానికి ధూప దీప నైవేద్య పథకం కింద ప్రభుత్వం నెలకి రూ.5వేలు ఇస్తోంది. అంటే సంవత్సరానికి రూ.60వేలు. అందులో నా జీతం రూ.24వేలుపోగా మిగిలిన రూ.36 వేలను దేవాలయం, ఇతర ఖర్చులకు సర్దుకుంటున్నాం. నెలకు ఇచ్చే మొత్తాన్ని రూ.10వేలకు పెంచడం శుభపరిణామం. కూటమి ప్రభుత్వానికి చంద్రమౌళీశ్వరస్వామి ఆశీస్సులు మెండుగా ఉండాలని వేడుకుంటున్నా.

- రామాయణం సురేష్, అర్చకుడు

జిల్లాలో మెగా ఇండస్ట్రియల్ హబ్

(5వ పేజీ తరువాయి)

ప్రతిపాదనలు పంపింది. దీంతో భూసేకరణ ప్రక్రియ ఊపందుకోనున్నట్లు సమాచారం.

ప్రతిపాదనలు పంపించాము



రామాయపట్నం అనుసంధానంగా మెగా ఇండస్ట్రియల్ హబ్ ఏర్పాటుకు భూసేకరణ చేసేందుకు ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వానికి, రెవెన్యూ శాఖకు ప్రతిపాదనలు పంపించాము. కావలి మండల పరిధిలోని మూడు గ్రామాల్లో భూములను గుర్తించాము. ఈ హబ్ ఏర్పాటు ద్వారా అనేక అంతర్జాతీయ పరిశ్రమలు జిల్లాకు రానున్నాయి.

- వీరశేఖర్‌రెడ్డి, ఏపీఐఐసీ జెడ్ఎం

అధికారులు వసూళ్లకు పాల్పడటం లేదు

- ఎక్సైజ్ డీసీ శ్రీనివాసరావు

నెల్లూరు(క్రైం), నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): వైన్ షాపుల పర్మినెంట్ లైసెన్సులకు ఎక్సైజ్ అధికారులు ఎలాంటి వసూళ్లకు పాల్పడటం లేదని, కొంత మంది తప్పుడు ప్రచారం చేస్తూ పత్రికలకు సమాచారం ఇస్తున్నారని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డీసీ పీ శ్రీనివాసరావు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలో నూతన మద్యం పాలసీని ప్రభుత్వ ఆదేశాల మేరకు ఉల్లంఘనకు తావు లేకుండా అమలు చేస్తున్నామని తెలిపారు. వైన్ షాపుల హద్దుల విషయంలో నియమ నిబంధనలు కఠినంగా పాటించడం వల్ల కొంత మంది వ్యక్తులు ఎక్సైజ్ అధికారుల మీద వ్యతిరేకత వ్యక్తం చేస్తున్నారని, వారే తప్పుడు ప్రచారం చేస్తున్నారన్నారు.

కొనితెచ్చుకుంటున్న కేన్సర్ !!

- అలవాట్లే అసలు కారణం
- పొగాకు ఉత్పత్తుల వాడకంతో ప్రమాదం
- సర్వైకల్, బ్రెస్ట్ కేన్సర్లతో తస్మాత్ జాగ్రత్త
- జిల్లాలో 20 వేల మందికిపైగా నమోదు
- నేడు జాతీయ కేన్సర్ అవగాహన దినం



నెల్లూరు (వైద్యం), నవంబరు 6 (ఆంధ్ర జ్యోతి) : జిల్లాలో కేన్సర్ వ్యాధి ప్రబలుతోంది. ప్రస్తుతం 20 వేల మందికిపైగా రోగులు నమోదయ్యారంటే పరిస్థితి ఎలా ఉందో తెలుస్తుంది. వీరిలో ఎక్కువ మంది వ్యాధి రెండోదశకు చేరుకున్నవారే. ఇంకా ఎంతో మంది వైద్య పరీక్షలు చేయించుకోక పోవటంతో వెలుగు లోకి రావడంలేదు. వ్యాధిగ్రస్తుల్లో ఎక్కువ శాతం గుట్కా, ఖైనీ, జరదా వంటి మత్తు పదార్థాలను నమిలేవారు ఉన్నారు. ఆ అలవాట్లతో నోటి కేన్సర్‌కు సంబంధించి దవడ, నాలుక, స్వరపేటిక కేన్సర్ బారినపడుతు న్నారు. ధూమపానంతో ఊపిరి తిత్తుల కేన్సర్‌కు గురవుతున్నారు. మహిళల విషయానికి వస్తే బ్రెస్ట్ కేన్సర్ బాధితుల సంఖ్య కూడా జిల్లాలో ఎక్కువగానే ఉంది. సురక్షితంకాని లైంగిక సంబంధాల వల్ల వైరల్ ఇన్‌ఫెక్షన్ ద్వారా మహిళల్లో గర్భాశయ ముఖద్వార కేన్సర్ బాధితులు పెరుగుతున్నారు. ఇటువంటి వ్యాధిని నయం చేయవచ్చని, ఇతర అవయవాలకు సోకిన కేన్సర్ మాత్రం నివారణ కష్టతరమని వైద్యనిపుణులు చెబుతున్నారు.

చికిత్సలు ఇలా..

నెల్లూరులోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో కేన్సర్ వ్యాధికి కొంత వరకు చికిత్సలు అందుతున్నాయి. ఇండియన్ రెడ్‌క్రాస్ కేన్సర్ విభాగం ప్రతి ఏటా 5 వేల మందికిపైగా కేన్సర్ బాధితులకు వైద్య సేవలు అందిస్తోంది. మెడికవర్ ఆసుపత్రిలోనూ కేన్సర్‌కు చికిత్స చేస్తున్నారు. కొంత మంది వ్యాధిగ్రస్తులు హైదరాబాద్‌లోని బసవతారకం కేన్సర్ ఆసుపత్రిని, తిరుపతి లోని స్విమ్స్ కేన్సర్ విభాగాన్ని, చెన్నైలోని ఆసుపత్రులను ఆశ్రయిస్తున్నారు. ప్రస్తుతం ఎన్టీఆర్ హెల్త్‌కేర్ ట్రస్ట్ కింద ఎంతో మంది వైద్యం చేయించుకుంటున్నారు.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

- వాతావరణ కాలుష్యం లేకుండా చూసుకోవడం
- ధూమ, మద్యపానానికి దూరంగా ఉండడం
- 25 ఏళ్ల వయసు దాటిన మహిళలు తప్పనిసరిగా వక్షోజాల కేన్సర్, గర్భాశయ ముఖద్వార కేన్సర్ పరీక్షలు చేయించుకోవడం
- వక్షోజాలలో గడ్డలు ఉన్నాయని అనుమానిస్తే వెంటనే వైద్యులను సంప్రదించడం.

రెడ్‌క్రాస్ కేన్సర్ ఆసుపత్రిలో సేవలు ఇలా..

సంవత్సరం	సర్జరీలు	రేడియేషన్	కీమో
2021	1114	547	4220
2022	886	536	6011
2023	834	547	7405
2024 (ఆగస్టు వరకు)	615	409	5240


ముందే గుర్తిస్తే నయం చేయవచ్చు



కేన్సర్ వ్యాధిని మొదటి దశలోనే గుర్తిస్తే పూర్తిగా నయం చేయవచ్చు. ప్రస్తుతం ఎన్నో వైద్య విధానాలు అందుబాటులో ఉన్నాయి. మహిళలు ఎప్పటికప్పుడు పరీక్షలు చేయించు కోవాలి. ఏడాదికి ఒకసారైనా బ్రెస్ట్, సర్వైకల్ కేన్సర్ పరీక్షలు తప్పనిసరి. నేడు ప్రధానంగా రొమ్ము కేన్సర్‌కు అనేక మంది గురవుతున్నారు. పొగాకు ఉత్పత్తులు, మద్యం వాడకం వల్ల నోటి, స్వర పేటిక కేన్సర్ బాధితులు ఎక్కువవుతున్నారు. రెడ్‌క్రాస్ ఆసుపత్రికి ఇతర జిల్లాల నుంచి కూడా రోగులు వస్తున్నారు.

- డాక్టర్ నాగేశ్వరరావు, రెడ్‌క్రాస్ కేన్సర్ ఆసుపత్రి సూపరింటెండెంట్

నిర్లక్ష్యం వద్దు



కేన్సర్ వ్యాధిపై నిర్లక్ష్యం వద్దు. అనుమానం ఉంటే వెంటనే వైద్యులను సంప్రదించాలి. ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో కేన్సర్ విభాగం ఉంది. శస్త్రచికిత్సలు, కీమోథెరపీ చికిత్సలు అందిస్తున్నాం. ఆహారపు అలవాట్లు మార్చు కోవాలి. ఆకలి తగ్గిపోయినా, ఒక్కసారిగా బరువు తగ్గినా వెంటనే వైద్యులను సంప్రదించాలి. ప్రస్తుతం కేన్సర్ కేసులు పెరగటం బాధాకరం. మహిళలు కనీసం ఏడాదికి ఒకసారైనా బ్రెస్ట్ కేన్సర్, సర్వైకల్ కేన్సర్ పరీక్షలు చేయించుకోవాలి. 13 నుంచి 14 ఏళ్ల వయసున్న యువతులు తప్పనిసరిగా వ్యాధి నిరోధక ఇంజక్షన్ వేయించుకోవాలి. ఈ విధంగా మూడు నెలలకు రెండు దఫాలుగా వేయించుకుంటే భవిష్యత్తులో గర్భాశయ కేన్సర్ రాదు.

- డాక్టర్ పద్మావతి, జీజీహెచ్ కేన్సర్ వైద్య నిపుణులు

డిప్యుటేషన్లలో అక్రమాలు జరిగాయా?

● వైద్య ఆరోగ్య శాఖలో జేడీ విచారణ

నెల్లూరు (వైద్యం), నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : వైద్య ఆరోగ్యశాఖ అధికారుల పనితీరుపై ఆ శాఖ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ కామేశ్వరప్రసాద్ బుధవారం విచారణ చేపట్టారు. వైద్యుల డిప్యుటేషన్ల విషయంలో పలు ఫిర్యాదులు రావటంతో విచారణ జరిపారు. డిప్యుటేషన్ పేరుతో అక్రమంగా వైద్యులను వారు కోరుకున్న చోటికి వేశారన్న ఆరోపణల్లో వాస్తవాలపై ఆరా తీశారు. డిప్యుటేషన్ల వ్యవహారంలో పెద్ద ఎత్తున అవినీతి జరిగిందన్న కోణంలోనూ ఈ విచారణ కొనసాగింది. మర్రిపాడు మండలం కృష్ణాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పనిచేస్తున్న డాక్టర్ వంశీకృష్ణ పీజీ వైద్య విద్యను అభ్యసించేందుకు వెళ్లారు. అయితే వైద్య ఆరోగ్యశాఖ అధికారి అనుమతి లేకుండా, ఎలాంటి సమాచారం ఇవ్వకుండా ఆయన వెళ్లటంపై కూడా విచారణ చేపట్టారు. గురువారం కూడా విచారణ కొనసాగుతుందని వైద్య శాఖ వర్గాలు వెల్లడించాయి.

రైలు ఆగగానే తాగునీటి కోసం పరుగులు తీసే ప్రయాణికులు కొళాయి దగ్గర పరిస్థితిని చూసి ఈ నీరేలా తాగేదంటూ వెనుతిరుగుతున్నారు. బిట్రగుంట రైల్వే స్టేషన్‌లోని 1, 2 ప్లాట్‌ఫాంల వద్ద తాగునీటి కుళాయిల వద్ద పరిస్థితి దారుణంగా ఉంది. కోవిడ్ పేరుతో బిట్రగుంటలో కొన్ని రైళ్ల స్టాపింగ్ ఎత్తివేయడంతో



ఇక్కడ నీళ్లు ఎలా తాగాలి ?

మెయింటెనెస్ పూర్తిగా తగ్గిపోయింది. అధికారులు స్పందించి తాగునీటి కుళాయిల వద్ద పరిశుభ్రంగా ఉండేలా చూడాలని ప్రయాణికులు కోరారు.

- బిట్రగుంట, (ఆంధ్రజ్యోతి)

కావలి నడిబొడ్డున ఉన్న ఉదయగిరి బ్రిడ్జి కూడలిలో నిత్యం ట్రాఫిక్ సమస్యలు వెంటాడుతున్నాయి. వంతెనకు రెండు వైపులా ఉన్న రోడ్లు ఆక్రమణలకు గురికావటంతో వాహనాలు అప్రోచ్ రోడ్లలో ఆగి ప్రయాణికులను ఎక్కించుకుంటున్నాయి. భారీ వాహనాల కూడా వంతెన ప్రవేశమార్గంలోనే ఆగుతు న్నాయి. దీంతో ఆర్వోబీ వంతెన మీదకు వెళ్లే వాహనాలు, వంతెన నుంచి వచ్చే వాహనాలు ట్రాఫిక్‌లో చిక్కుకుంటు న్నాయి. పోలీసు,మున్సిపల్ అధికారులు స్పందించి ఆక్రమణలను తొలగించాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

- కావలి, (ఆంధ్రజ్యోతి)

● ట్రాఫిక్ కష్టాలు ఎప్పటికి తొలిగేనో..!



ఆర్వోబీ వంతెన ప్రవేశమార్గంలో నిలిచిన వాహనాలు

పోరాటస్ఫూర్తితో జీవితాన్ని గెలవచ్చు : ఎమ్మెల్సీ

● కావలిలో అంతర్ జిల్లాల కబడ్డీ పోటీల ప్రారంభం



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎమ్మెల్సీ చంద్రశేఖర్ రెడ్డి

కావలిటౌన్, నవంబరు6 (ఆంధ్రజ్యోతి): ఆటల్లో గెలుపోటములు సహజమని, పోరాట స్ఫూర్తిని అలవర్చుకుంటే జీవితాన్ని గెలవచ్చని ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని మద్దూరుపాడులో ఉన్న డీబీఎస్ ఇంజనీరింగ్ కళాశాల వేదికగా అండర్ 19స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఏపీ అంతర్ జిల్లాల కబడ్డీ పోటీలు బుధవారం ప్రారంభమయ్యాయి. డీబీఎస్ కరస్పాండెంట్ దామిశెట్టి సుధీర్‌నాయుడు అధ్యక్షతన ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా చంద్రశేఖర్ రెడ్డి పాల్గొని మాట్లాడారు. జిల్లా కేంద్రంలో జరగాల్సిన రాష్ట్ర స్థాయి క్రీడాపోటీలకు డీబీఎస్ లో నిర్వహించడం అభినందనీయమన్నారు. డీబీఎస్ చైర్మన్ డీ శ్రీనివాసులు నాయుడు మాట్లాడుతూ తమకు అవకాశం దొరికినప్పుడల్లా రాష్ట్రస్థాయి పోటీల నిర్వహణకు వెనుకాడబోమన్నారు. ముందుగా ఎమ్మెల్సీ క్రీడాజ్యోతిని వెలిగించి క్రీడాకారులకు అందించారు. అనంతరం క్రీడాకారులను పరిచయం చేసుకుని, టాస్ వేసి పోటీలను ప్రారంభించారు. ఈ పోటీలు మూడు రోజులపాటు జరగనున్నట్లు ఎస్‌జీఎఫ్ సెక్రటరీ శ్రీరేష్ తెలిపారు. కార్యక్రమంలో డీవీఈవో మధుబాబు, ఆర్ఐవో శ్రీనివాసులు జిల్లా క్రీడాధికారి యతిరాజులు, జేబీ పీడీలు మాల్యాద్రి, ప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తీసుకున్న రుణాలు చెల్లించండి

● పశుసంవర్ధక శాఖ జేడీ రమేష్‌నాయక్



మాట్లాడుతున్న జేడీ రమేష్‌నాయక్, వేదికపై నాగమణి సోమయ్య, మాధవీలత

నెల్లూరు (వ్యవసాయం), నవంబరు 6(ఆంధ్రజ్యోతి): గొర్రెలు, మేకల పెంపకందారులు తీసుకున్న రుణాలు సకాలంలో చెల్లించాలని, అలాచేస్తే ప్రభుత్వం కొత్త రుణాలు అందిస్తుందని పశుసంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ రమేష్‌నాయక్ తెలిపారు. గొర్రెలు, మేకల పెంపకందారుల సహకార సంఘం అధ్యక్షుల మహాజన సభ బుధవారం నెల్లూరులోని పశుసం వర్ధకశాఖ కార్యాలయంలో జరిగింది. జేడీ మాట్లాడుతూ 2021-22లో తీసుకున్న రుణాలను 80శాతం మంది తిరిగి చెల్లించారని, మిగిలిన 20శాతం మంది కూడా చెల్లించి నూతన రుణాలు పొందాలని సూచించారు. బీమా సౌకర్యం కల్పించాలని, మందులు అందేలా చూడాలని, పింఛన్లు ఇప్పించా లని సహకార సంఘం అధ్యక్షులు అధికారులను కోరారు. ఈ సమావేశంలో సహకార సంఘం అధ్యక్షురాలు అరుణమ్మ, డీడీలు నాగమణి, సోమయ్య, ఏడీ మాధవీలత పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమి ఆక్రమిస్తే క్రిమినల్ కేసులు



ప్రభుత్వ భూమిలో నిమ్మ మొక్కలను తొలగిస్తున్న రెవెన్యూ సిబ్బంది



ఆక్రమణదారులు అడ్డుకోకుండా పోలీసుల బందోబస్తు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

కలువాయి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ భూమిని ఆక్రమించి సాగు చేసిన వారిపై క్రిమినల్ కేసులు పెడతామని తహసీల్దారు శ్యామ్‌సుందరరాజు హెచ్చరించారు. ప్రభుత్వ భూమేగా.... ఆక్రమించేయ్! శీర్షికన బుధవారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి రెవెన్యూ అధికారులు స్పందించారు. దాచూరు రెవెన్యూ పరిధిలోని సర్వే నెంబరు 989లోని మేత పోరంబోకు భూముల్లో అక్రమంగా సాగు చేసిన పైర్లను బుధవారం రెవెన్యూ సిబ్బంది తొలగించారు. తాహసీల్దారు ఆదేశాల మేరకు గ్రామ వీఆర్వో మహేష్ మరి కొంతమంది రెవెన్యూ సిబ్బంది ఉదయమే ఈ భూముల వద్దకు చేరుకున్నారు. ప్రభుత్వ భూమిలో సాగు చేసిన నిమ్మ మొక్కలను తొలగించే ప్రయత్నం చేయగా ఆక్రమణదారులు వారిని అడ్డుకున్నారు. ఈ విషయం తహసీల్దారు దృష్టికి తీసుకుపోగా పోలీసు బందోబస్తు మధ్య నిమ్మ మొక్కలను రెవెన్యూ సిబ్బంది తొలగించారు. మరోసారి ఈ భూములను ఎవరైనా ఆక్రమించాలని చూస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని వారు హెచ్చరించారు.

పోక్సో కేసులో నిందితుడి అరెస్టు

నెల్లూరు(క్రైం), నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): బాలికపై లైంగిక దాడికి పాల్పడిన ఆటో డ్రైవర్‌ను పోలీసులు అరెస్టు చేశారు. పోలీసుల సమాచారం మేరకు... నెల్లూరులోని భగత్ సింగ్ కాలనీ టిడ్కో గృహాల్లో నివాసం ఉంటున్న మహిళ కుమార్తె ఆరో తరగతి చదువుతోంది. ఆ బాలికపై అదే ఇళ్లలో నివాసం ఉంటున్న ఆటో డ్రైవర్ అలీ పలుమార్లు లైంగిక దాడికి పాల్పడ్డాడు. బాలిక తల్లి ఫిర్యాదు మేరకు నవాబుపేట పోలీసులు పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. విచారణ చేపట్టిన నగర డీఎస్పీ డీ శ్రీనివాసులురెడ్డి పరారీలో ఉన్న నిందితుడి కోసం గాలింపు చర్యలు చేపట్టారు. బుధవారం వెంకటేశ్వరపురం పాల డెయిరీ సమీపంలో నిందితుడు అలీని అరెస్టు చేశారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో
బాయిలర్ లైవ్	130
లేయర్ లైవ్	110
స్కిన్ చికెన్	236
స్కిన్‌లెస్	262
లేయర్	187

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ.7555
వెండి కిలో ధర	రూ. 96,100
వెండి ఒక గ్రాము	రూ.99.10

చికిత్స పొందుతూ పెయింటర్ మృతి

మనుబోలు, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): ఆత్మహత్యాయత్నంకు పాల్పడిన పెయింటర్ అడపాల విజయ్‌కుమార్ (57) చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందినట్లు ఎస్‌ఐ శివరాకేష్ తెలిపారు. స్థానిక అంబేడ్కర్ నగర్‌కు చెందిన విజయ్‌కుమార్ చంద్రమౌళీ నగర్‌లో నివాసం ఉంటూ పెయింటర్‌గా పనిచేసుకుంటూ జీవనం సాగించేవాడు. ఈనెల 4వ తేదీన మద్యం కోసం డబ్బులు కావాలని ఇంట్లో భార్యతో వాదనకు దిగాడు, డబ్బులు ఇచ్చేందుకు ఆమె నిరాకరించడంతో మనస్థాపానికి గురై మొక్కలకు పిచికారి చేసే పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఆయనను చికిత్స నిమిత్తం గూడూరుకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడికి భార్య, కుమారుడు ఉన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఈ రబీలో డ్రోన్లు ఎగిరేనా?



- ఎరువులు, మందులు పిచికారీకి ఎంతో ఉపయోగం
- రైతులకు పెట్టుబడి వ్యయం తగ్గే అవకాశం
- మండలానికి మూడు చొప్పున కేటాయింపు?
- శిక్షణ పూర్తి చేసుకున్న 28 మంది పైలెట్లు
- ప్రభుత్వ ఉత్తర్వుల కోసం రైతుల నిరీక్షణ

నెల్లూరు(వ్యవసాయం), నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : వ్యవసాయంలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానానికి ప్రభుత్వం పెద్ద పీట వేస్తోంది. ముఖ్యంగా పంటలపై ఎరువులు, పురుగు మందుల పిచికారీకి డ్రోన్లను ఉపయోగించేం దుకు సిద్ధమైంది. డ్రోన్ల పనితీరుపై ఇప్పటికే అనేక అవగాహన కార్యక్రమాలు చేపట్టింది. ప్రతి రైతుకు అందుబాటులో ఉండేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు వ్యవసాయశాఖకు ఆదేశాలు కూడా జారీ చేశారు. ఈ నేపథ్యంలో ప్రస్తుత రబీ సీజన్‌లోనే పంటలపై డ్రోన్లు ఎగురుతాయని కర్షకులు ఆశిస్తున్నారు.

గత ప్రభుత్వం ప్రకటనలకే పరిమితం

వ్యవసాయ యాంత్రీకరణలో భాగంగా గత ప్రభుత్వం రైతులను సాంకేతికతపరంగా ప్రోత్సహించేం దుకు రైతు సంఘాలకు 40శాతం రాయితీపై డ్రోన్లను మంజూరు చేయాలని భావించింది. కూలీల కొరతను అధిగమించి పంటలకు చీడపీడల నివారణకు అవసరమైన రసాయనిక ఎరువులను చల్లడమే డ్రోన్ల వినియోగ ముఖ్య ఉద్దేశం. అయితే వైసీపీ ప్రభుత్వం కేవలం ప్రకటనలకే పరిమితమైంది. డ్రోన్ల నిర్వహణకు అవసరమైన పైలట్లను ఎంపిక చేయడంతో పాటు వారిని శిక్షణకు పంపేవరకు వ్యవసాయాధికారులను ఉరుకులు, పరుగులు పెట్టించింది. వారికి లక్ష్యాలు కూడా నిర్దేశించింది. కానీ ఎక్కడా ఒక్క డ్రోన్ కూడా మంజూరు చేసిన దాఖలాలు లేవు. కాగా, ప్రస్తుత కూటమి ప్రభుత్వం డ్రోన్లను రైతులకు అందుబాటులోకి తీసుకొచ్చేందుకు చర్యలు తీసుకుంటోంది. 40శాతం రాయితీ పోను మిగిలిన 60శాతం ఆయా రైతు సంఘాలకు బ్యాంకు రుణం ద్వారా డ్రోన్‌ను అందించాలని ప్రణాళిక రచిస్తోంది. మండలానికి మూడు చొప్పున డ్రోన్లు మంజూరు చేయాలనే ఆలోచనలో ఉన్నట్లు వ్యవసాయ అధికారులు చెబుతున్నారు.

● 30 శాతం పెట్టుబడి ఆదా..

డ్రోన్లతో పురుగు మందుల పిచాకారీ వల్ల పొలం మొత్తానికి సమానంగా మందు చేరుతుంది. ఎరువులు, పురుగు మందుల వినియోగంలో దాదాపుగా 30శాతం పెట్టుబడి ఆదా అవుతుందని వ్యవసాయ శాఖ అధికారుల అంచనా. అంతే కాదు పరిమిత సమయంలో పిచికారీ చేయవచ్చు. దీంతో చీడ పీడలను అరికట్టే అవ కాశం ఉంది. ఫలితంగా రైతులకు శ్రమతోపాటు సమయం తగ్గుతుంది. అయితే డ్రోన్ల కేటాయింపు, వినియోగంపై ప్రభుత్వం నుంచి పూర్తిస్థాయిలో మార్గదర్శకాలు అందాల్సి ఉందని సమాచారం.

28 మంది పైలెట్లు సిద్ధం



డ్రోన్లతో పురుగు మందుల పిచికారీ అందుబాటులోకొస్తే రైతులకు ఎంతో ఉపయోగంగా ఉంటుంది. వారికి శ్రమ తగ్గడంతోపాటు కూలీల కొరతను అధిగమించవచ్చు. డ్రోన్ల ఉపయోగంపై జిల్లా వ్యాప్తంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాం. 28 మంది పైలట్లు శిక్షణ పూర్తి చేసుకుని సిద్ధంగా ఉన్నారు. అత్యాధునిక డ్రోన్లను రైతులకు అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఉంది. ఆ డ్రోన్లు ఈ రబీకి అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది. వీటికి సంబంధించి మార్గదర్శకాలు జారీ చేయాల్సి ఉంది.

- పీ సత్యవాణి, జిల్లా వ్యవసాయాధికారి

డిగ్రీ పరీక్షల్లో నలుగురి డీబార్

వెంకటాచలం, నవంబరు 6(ఆంధ్రజ్యోతి) : విక్రమ సింహపురి యూనివర్శిటీ పరిధిలోని అనుబంధ డిగ్రీ కళాశాలలో బుధవారం మధ్యాహ్నం జరిగిన డిగ్రీ మూడవ సెమిస్టర్ పరీక్షలలో నలుగురు విద్యార్థులు డీబార్ అయినట్లు వీఎస్‌యూ పరీక్షల నిర్వాహణాధికారిని డాక్టర్ ఆర్ మధుమతి ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్షలలో మొత్తం 9,865 మంది విద్యార్థులకుగాను 9,135 మంది హాజరు కాగా 730 మంది గైర్హాజరయ్యారు. గూడూరులోని డీఆర్‌డబ్ల్యూ డిగ్రీ కళాశాలలో ముగ్గురు, పొదలకూరులోని విజ్ఞాన్ డిగ్రీ కళాశాలలో ఒకరు మొత్తం నలుగురు విద్యార్థులు డీబార్ అయినట్లు వెల్లడించారు.



మాట్లాడుతున్న డీఆర్వో ఉదయభాస్కర్‌రావు

డీఎస్సీ స్ర్కీనింగ్ టెస్ట్‌కు కట్టుదిట్టమైన చర్యలు : డీఆర్వో

నెల్లూరు(హరనాథపురం), నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : ఎస్సీ ఎస్టీ అభ్యర్థులకు డీఎస్సీ ఉచిత శిక్షణ కోసం ఈనెల 10న జరగబోయే స్ర్కీనింగ్ టెస్టుకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని జిల్లా రెవెన్యూ అధికారి జే ఉదయ భాస్కర్‌రావు అధికారులను ఆదేశించారు. ఈ పరీక్ష సమన్వయ కమిటీ సమావేశం డీఆర్వో చాంబర్‌లో బుధవారం జరిగింది. ఆయన మాట్లాడుతూ స్ర్కీనింగ్ పరీక్ష ఈనెల 10న ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1:30 గంటల వరకు ఆన్‌లైన్ విధానంలో జిల్లాలోని ఆరు కేంద్రాల్లో జరుగుతుందని చెప్పారు. జిల్లాలో 499 మంది విద్యార్థులు హాజరవుతారన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని సూచించారు. అభ్యర్థులు ఆ రోజు ఉదయం 10 గంటలకల్లా పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలన్నారు. అనుమానాలేమైనా ఉంటే 9581630003 నెంబరును సంప్రదించాలని కోరారు. ఈ సమావేశంలో సాంఘిక సంక్షేమ శాఖ డీడీ శ్రీనివాసులు, ఐడీడీఏ పీవో పరిమళ, డీఎంహెచ్‌వో పెంచలయ్య తదితరులు పాల్గొన్నారు.

ముగ్గురు బాల కార్మికుల గుర్తింపు

నెల్లూరు (సాంస్కృతికం), నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనలో భాగంగా కార్మిక శాఖ ఆధ్వర్యంలో బుధవారం బాల కార్మిక టాస్క్‌ఫోర్సు కమిటీ కొరడావీధి, గిడ్డంగి వీధుల్లో తనిఖీలు చేసింది. ముగ్గురు బాలకార్మికులను గుర్తించారు. వారితో పనిచేయిస్తున్న యజమానులపై చర్యలు తీసుకుంటాయని కార్మిక శాఖ డిప్యూటీ కమిషనర్ వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో సహాయ కమిషనర్ ఎస్‌కే గౌస్, సహాయ కార్మిక అధికారులు, ఎన్జీవోలు పాల్గొన్నారు.

ఉత్తరక్రియలకు హాజరైన ప్రముఖులు



'పాపకన్ను' ఉత్తరక్రియలకు ప్రముఖుల హాజరు

రాపూరు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): రాపూరు మండల మాజీ సమితి అధ్యక్షుడు పాపకన్ను రాజశేఖర్‌రెడ్డి ఇటీవల కాలంచేసిన విషయం విదితమే. బుధవారం రాపూరు మండలంలోని వేపినాపి గ్రామంలో ఆయన నివాసంలో జరిగిన ఉత్తరక్రియలకు ప్రముఖులు హాజరయ్యారు. తిరుపతి పార్లమెంటు సభ్యుడు డాక్టర్ మద్దెల గురుమూర్తి హాజరై పాపకన్ను చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. అనంతరం ఉత్తరక్రియలకు హాజరైన మాజీ పార్లమెంటు సభ్యులు ఆదాల ప్రభాకర్‌రెడ్డి, మేకపాటి రాజమోహన్‌రెడ్డి, వెంకటగిరి వైసీపీ ఇన్‌చార్జ్ నేదురుమల్లి రాంకుమార్‌రెడ్డి, ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్, విజయా డెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, మాజీ ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి, మాజీ జడ్పీ చైర్మన్ బొమ్మిరెడ్డి రాఘవేంద్రరెడ్డి, ఉదయగిరి వైసీపీ ఇన్‌చార్జ్ మేకపాటి రాజగోపాల్‌రెడ్డి తదితరులను కలిసి మాట్లాడారు.

సోలార్ ప్యానల్‌తో పర్యావరణ పరిరక్షణ

● ఏపీ ఎస్‌పీడీసీఎల్ ఎస్ఈ విజయన్



మాట్లాడుతున్న ఎస్ఈ విజయన్

తోటపల్లిగూడూరు, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): సోలార్ ప్యానల్ పెట్టుకోవడం వలన వినియోగ దారులకు విద్యుత్ చార్జీలు తగ్గటమే కాకుండా పర్యావరణాన్ని కాపాడు కోవచ్చని ఏపీ ఎస్‌పీడీసీఎల్ ఎస్ఈ విజయన్ పేర్కొన్నారు. మండలంలోని సంఘమిత్ర కార్యాలయంలో బుధవారం అన్ని శాఖల అధికారులతో సోలార్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. అనంతరం ఎస్ఈ మాట్లాడుతూ సోలార్ ప్యానెల్స్‌ను అమర్చేందుకు ప్రధానమంత్రి సూర్య ఘర్ యోజన పథకం అమలు చేస్తున్నారని తెలిపారు. దేశంలోని పేద, మధ్య తరగతి ప్రజల కరెంటు బిల్లును తగ్గించడానికి సోలార్ ఎంతో ఉపయోగకరమన్నారు. 5వేల జనాభా ఉన్న గ్రామంలో సోలార్‌ను అమర్చుకుంటే ఆ గ్రామ అభివృద్ధికి ప్రధానమంత్రి నరేంద్రమోదీ రూ.కోటి ఇస్తున్నారని తెలిపారు. సోలార్ వినియోగంలో నెల్లూరు జిల్లా కూడా ముందంజలో ఉండాలని, అందుకు అధికారులందరూ సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఈఈ సోమశేఖర్, డిప్యూటీ ఈఈ రాము, మండల అభివృద్ధి అధికారి వెంకటేశ్వర్లు, ఏఈలు సుకుమార్, ప్రతాప్, సోలార్ నెడ్‌కాప్ అధినేత రాజశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి

● నెల్లూరులో ఏబీవీపీ నిరసన

నెల్లూరు(విద్య), నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు వెంటనే విడుదల చేయాలని ఏబీవీపీ నాయకులు డిమాండ్ చేశారు. నెల్లూరులోని అన్నమయ్య సెంటర్‌లో బుధవారం విద్యార్థులతో కలిసి నిరసన తెలిపారు. ఏబీవీపీ రాష్ట్ర టెక్నికల్ సెల్ కన్వీనర్ తోట బాలాజీ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నార న్నారు. కళాశాలల యాజమాన్యాలు ఫీజుల కోసం విద్యార్థులను ఇబ్బంది పెడుతున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించాలని, లేనిపక్షంలో ఆందోళనకు దిగుతామని హెచ్చరిం చారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు విభాగ్ కన్వీనర్ రాజశేఖర్, నగర సహాయ కార్యదర్శులు నవీన్, సుకుమార్, జోనల్ ఇన్‌చార్జి హేమంత్ పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న ఏబీవీపీ నాయకులు

టెన్త్ పరీక్షల ఫీజు చెల్లింపు గడువు పెంపు

నెల్లూరు(విద్య), నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : ప్రస్తుత విద్యా సంవత్సరా నికి సంబంధించి పదో తరగతి పబ్లిక్ పరీక్షల ఫీజు చెల్లింపు గడువు పొడిగించినట్లు డీఈవో ఆర్ బాలాజీరావు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. రెగ్యులర్ అభ్యర్థులు అన్ని సబ్జెక్టులకు రూ.125, మూడు సబ్జెక్టులకు రూ.125, మూడు సబ్జెక్టుల వరకు రూ.110 చెల్లించాలని తెలిపారు. ఒకేషనల్ అభ్యర్థులు అదనంగా రూ.60, అండర్ ఏజ్ అభ్యర్థులు రూ.300, మైగ్రేషన్ సర్టిఫికెట్ కోసం రూ.80 చొప్పున ఈ నెల 18వతేదీ లోపు చెల్లించాలన్నారు. రూ.50 అపరాధ రుసుముతో ఈ నెల 25 వరకు, రూ.200 అపరాధ రుసుముతో డిసెంబరు 3వతేదీ వరకు, రూ.500 అపరాధ రుసుముతో డిసెంబరు 10వతేదీ వరకు ఫీజు చెల్లించవచ్చని తెలిపారు. పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఈనెల 18 నుంచి www.bse.ap.gov.in వెబ్‌సైట్‌లో పాఠశాల లాగిన్ ద్వారా మాత్రమే ఫీజు చెల్లించాలని సూచించారు.


ప్రజా, రైతు సమస్యల పరిష్కారంలో ప్రభుత్వాలు విఫలం : సీపీఎం


విలేకరులతో మాట్లాడుతున్న అజయ్‌కుమార్

ఉదయగిరి రూరల్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ప్రజలు, రైతుల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వాలు విఫలమయ్యాయని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు కటారి అజయ్ కుమార్ అన్నారు. బుధవారం స్థానిక పుచ్చలపల్లి సుందరయ్య భవనంలో నాయకులు, కార్యకర్తలతో సమీక్షించారు. అనంతరం ఆయన విలేఖరులతో మాటాడుతూ మెట్ట ప్రాంతమైన ఉదయగిరి నియోజకవర్గంలో సాగు, తాగునీరు కరువై రైతులు, యువత వలసబాట పడుతున్నా టీడీపీ, వైసీపీ ప్రభుత్వాలు పట్టించుకోకపోవడం దారుణమన్నారు. ఉదయగిరి-బండగానిపల్లి ఘాట్‌రోడ్డు, ఉదయగిరి-నందవరం రోడ్డు నిర్మాణాలు చేపట్టాలని పాలకులు, అధికారుల చుట్టూ ప్రదక్షణలు చేసినా ఫలితం లేదన్నారు. ఉదయగిరి వైద్యశాలలో మెరుగైన వైద్యసేవలు అందడం లేదన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి సీపీఎం ఆధ్వర్యంలో ఉద్యమాలు ఉధృతం చేస్తామన్నారు. ఈనెల 10న వరికుంటపాడు, ఉదయగిరి, సీతారామపురం మండలాలకు సంబంధించి ఉదయగిరిలో సీపీఎం ప్రాంతీయ మహాసభ, డిసెంబరు 7, 8వ తేదీల్లో జిల్లా మహాసభలు ఇందుకూరుపేట, ఫిబ్రవరి 1, 2, 3వ తేదీల్లో రాష్ట్ర మహాసభలు నెల్లూరులో జరుగుతాయని జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు కాకు వెంకటయ్య, ఫరుద్దీన్‌బాషా, కోడె రమణయ్యతదితరులు పాల్గొన్నారు.

శిథిలావస్థలో సదరన్ కాలువ వంతెన

- పొంచి ఉన్న ప్రమాదం
- భయాందోళనలో గ్రామస్థులు


శిథిలస్థితిలో ఉన్న సదరన్ కాలువపై ఉన్న వంతెన


కుంగిన సదరన్ కాలువ వంతెన రహదారి

సంగం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్నారెడ్డిపాళెం వద్ద ఉన్న సదరన్ చానల్ మీద ఉన్న మూడవ వంతెన శిథిలావస్థకు చేరుకోవడంతో ఎప్పుడు కూలుతుందోనని గ్రామస్థులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ వంతెన మీదుగానే అన్నారెడ్డిపాళెం, పల్లిపాళెం గ్రామస్థులు బుచ్చిరెడ్డిపాళెం గ్రామానికి రాకపోకలు సాగిస్తున్నారు. ఈ వంతెన నిర్మించి 130 సంవత్సరాలు కావడంతో కాంక్రీట్ కుంగి దెబ్బతింది. దీనిపై కంకర వేసి గ్రావెల్‌తో పూడ్చి ప్రస్తుతం రాకపోకలు సాగిస్తున్నారు. అన్నారెడ్డిపాళెం గ్రామం సంగం మండల కేంద్రానికి 14 కిలోమీటర్లు, బుచ్చిరెడ్డిపాళెంకు రెండు కిలోమీటర్ల దూరంలో ఉంది. దీంతో అన్నారెడ్డిపాళెం గ్రామస్థులు ఎక్కువగా దగ్గరలో ఉన్న బుచ్చిరెడ్డిపాళెం వైపు ప్రతి పనికి వెళ్తారు. సంగం మండల కేంద్రానికి రావాలన్నా బుచ్చిరెడ్డిపాళెంకు వెళ్లి అక్కడి నుండి బస్సులో వస్తారు.

పెరిగిన రాకపోకలు

అన్నారెడ్డిపాళెం గ్రామానికి ఏకైక రహదారిగా ఉన్న సదరన్ చానల్ వంతెన మీద రాకపోకలు పెరిగాయి. గ్రామంలో పండిన ధాన్యం ఈ రహదారి మీదగానే లారీలు, ట్రాక్టర్ల ద్వారా బయటకు తరలించాలి. దీంతో వంతెనపై భారం పడుతోంది. ఇంత ప్రాధాన్యత కలిగిన వంతెన శిథిల స్థితిలో ఉన్నా పట్టించుకునే నాథుడే లేడని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి శిథిలమైన వంతెన స్థానంలో నూతన వంతెన నిర్మించాలని కోరుతున్నారు.

పాఠశాల అభివృద్ధికి ఉపాధ్యాయుడి చేయూత


భూమిపూజ చేస్తున్న అధికారులు, దాత

అనంతసాగరం, నవరంబరు 6 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఉన్నత పాఠశాలలో స్టేజి నిర్మాణం కోసం ఆ పాఠశాలలో పనిచేసే బయాలజీ ఉపాధ్యాయుడు మెట్టుకూరు సుబ్బారెడ్డి చేయూత నందించారు. బుధవారం తన సొంత నిధులు రూ. 3 లక్షలు వెచ్చించి పనులకు భూమి పూజ చేశారు. దీంతో ఎంఈవో 2 ప్రభాకర్‌రెడ్డి, హెచ్‌ఎం లక్ష్మీప్రసన్న, ఉపాధ్యాయులు సుబ్బారెడ్డిని అభినందించారు.

మర్రిపాడులో ప్రబలుతున్న విషజ్వరాలు


శిబిరంలో రోగులను పరీక్షిస్తున్న వైద్య సిబ్బంది

మర్రిపాడు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలో రోజురోజుకు విషజ్వరాలు ప్రబలుతున్నాయి. ప్రతి ఇంటిలో ఒకరు జ్వరంతో బాధ పడుతూ రూ. వేలు ఖర్చు చేస్తున్నారు. కుటుంబంలో ఒకరికి జ్వరం వస్తే మిగతా వారందరికి ఆ వైరస్ వ్యాపించటంతో ఒక్కొక్కరుగా మంచాన పడుతున్నారు. గ్రామాల్లో వైద్యసిబ్బంది వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తున్నా, అవగాహన లోపంతో అత్యధికులు ఆత్మకూరు, బద్వేలు ప్రాంతాల్లోని ప్రైవేటు వైద్యశాలలకు క్యూ కడుతున్నారు. అక్కడ ఒక్కొక్కరికి రూ. 2 నుంచి రూ. 3వేల వరకు ఖర్చు అవుతోంది. నెల్లూరు తదితర పట్టణాలకు వెళితే రూ. 5 వేల నుంచి రూ. 8వేలు వరకు ఖర్చు చేయక తప్పడం లేదు. గతంలో జ్వరం వస్తే పారాసెటమాల్, డోలో 600 వాడితే జ్వరం తగ్గేది. కానీ ఇప్పుడు మూడునాలుగు రోజులపాటు యాంటీబయాటిక్ వాడాల్సి వస్తున్నది. ఇటీవల కురిసిన వర్షాలకు వాతావరణంలో మార్పులు వచ్చాయి. భూగర్భజలాలు కలుషితమయ్యాయి. అంతేకాక గ్రామాల్లో రోడ్ల వెంబడి ఎక్కడిబడితే అక్కడ చెత్త పేరుకుపోయింది. ఈ సీజన్‌లో బ్లీచింగ్ చల్లడం, శానిటేషన్ పనులపై సర్పంచులు శ్రద్ధ పెట్టడం లేదు.దీంతో ప్రతి గ్రామంలో జ్వర పీడితులు ఉంటున్నారు.

పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలి

వాతావరణ మార్పులతో నీరు కలుషితమైంది. ఎంఎల్‌హెచ్‌పీల చేత ప్రతి గ్రామంలో తాగునీటికి శ్యాంపిల్ సేకరించి పరీక్షలు చేస్తున్నాం. జనవరి వరకు కాంచిన నీటిని తాగటంతో అనారోగ్యానికి దూరంగా ఉండవచ్చు. అలాగే పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి.

- డాక్టర్ గోపినాథ్, మర్రిపాడు పీహెచ్‌సీ వైద్యాధికారి

ఉపాధి కూలీలకు అవగాహన


కూలీలకు అవగాహన కల్పిస్తున్న ఏపీడీ

వలేటివారిపాలెం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : ఉపాధి కూలీలకు కొలతల ప్రకారమే వేతనాలు లభిస్తాయని ఉపాధి హామీ పథకం ఏపీడీ బాబూరావు తెలిపారు. మండలంలోని శింగమనేని పల్లెలో గల అంకన్నకుంటలో జరుగుతున్న ఉపాధి పనులను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఉపాధి కూలీల హాజరు మస్టర్లను పరిశీలించారు. తనిఖీ సమయంలో ఫీల్డ్‌అసిస్టెంట్ జీ ప్రసాద్‌రావు తదితరులు ఉన్నారు.

బోగస్ మస్టర్లపై గట్టి చర్యలు

- కందుకూరు ఏపీడీ బాబూరావు



కందుకూరు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఉపాధిహామీ పథకంలో బోగస్ మస్టర్ల నిర్మూలనకు గట్టి చర్యలు తీసుకుంటున్నాం. ఫీల్డ్‌లో రెగ్యులర్‌గా విజిట్ చేస్తున్నా. రెండు గ్రామాల్లో తనిఖీలు చేసి బోగస్ మస్టర్లు ఉంటే ఆబ్సెంట్ వేయటమే గాక హెచ్చరికలు చేస్తున్నామని కందుకూరు ఏపీడీ జె బాబూరావు పేర్కొన్నారు.

? ఉపాధి హామీ పథకంలో బోగస్ మస్టర్ల నిరోధానికి ఏం చేస్తున్నారు

! బోగస్ మస్టర్ల నిర్మూలనకు గట్టి చర్యలు తీసుకుంటున్నాం. గ్రామాల్లో ఇంట్లో ఒకరికి బదులు మరొకరు పనికి వెళ్లటం వల్ల సమస్య వస్తోంది.

? గ్రామంలో నివాసం లేని వ్యాపారులు, సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు, విద్యార్థుల పేరుతో కూడా మస్టర్లు వేస్తున్నారట

! గ్రామంలో నివాసం లేని వారి జాబ్‌కార్డులు పరిశీలించి డిలీట్ చేయిస్తున్నాం. ఇప్పటికే 90 శాతం వరకు తొలగించాం. ఇంకా అలాంటి కార్డులు ఏమైనా ఉంటే తొలగిస్తాం.

? ఫీల్డ్ అసిస్టెంట్లపై ఏమైనా చర్యలు తీసుకున్నారా

! ప్రస్తుతానికి ఫీల్డ్ అసిస్టెంట్ల నియామకం జరగలేదు. అందరూ మేట్‌లుగానే చేయిస్తున్నారు. ఫీల్డ్ అసిస్టెంట్ల నియామకం జరిగాక చర్యలు ప్రారంభిస్తాం.

? గోకులం షెడ్లు, పండ్ల తోటలకు ప్రోత్సాహం ఎలా

! కందుకూరు నియోజకవర్గానికి 106 గోకులం షెడ్లు మంజూరయ్యాయి. ఉపాధి హామీ పథకంలో పండ్ల తోటలు పెంపకానికి ముందుకొచ్చేవారికి మూడేళ్లపాటు నిర్వహణకోసం ఎకరానికి లక్షన్నర వరకు లబ్ధి చేకూరుతుంది.

ఉపాధ్యాయులను నియమించాలి : యూటీఎఫ్


ఎంఈవోను అభినందిస్తున్న యూటీఎఫ్ నాయకులు

వరికుంటపాడు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): పరీక్షల సమయం ఆసన్న మవుతున్నప్పటికీ పూర్తి స్థాయిలో ఉపాధ్యాయులను నియమించకపోవడం దారుణమని యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి రావిళ్ల నాగార్జున అన్నారు. బుధవారం స్థానిక విద్యావనరుల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ ఇటీవల వర్క్ అడ్జస్ట్‌మెంట్ జరిగినప్పటికీ పెద్దిరెడ్డిపల్లి, కాకొల్లువారిపల్లి ఉన్నత పాఠశాలల్లో ప్రధానమైన గణిత సబ్జెక్ట్ ఉపాధ్యాయులు లేకపోవడంతో విద్యార్థులతో సహా తల్లిదండ్రులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారన్నారు. వెంటనే ఉపాధ్యాయుల కొరతతో పాటు పాఠశాలల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అనంతరం ఇన్‌చార్జి ఎంఈవో-1గా నూతన బాధ్యతలు చేపట్టిన షేక్ మస్తానవలిని ప్రత్యేకంగా అభినందించి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి వి సుబ్రమణ్యం, బాధ్యులు ఎం సుబ్బారావు, ఎం మనోహర్ పాల్గొన్నారు.

దోమల నివారణకు ఫాగింగ్


ఫాగింగ్ చేస్తున్న మున్సిపల్ అధికారులు

కావలి, నవంబరు6 (ఆంధ్రజ్యోతి) : దోమల నివారణకు కావలిలో మున్సిపల్ అధికారులు పాగింగ్ చేస్తున్నారు. బుధవారం పట్టణంలోని పాతూరులో పాగింగ్ చేపట్టారు. దోమలనివారణే లక్ష్యంగా పట్టణంలోని అన్ని వార్డుల్లో నిత్యం పాగింగ్ కొనసాగుతోందని మున్సిపల్ కమిషనర్ జీ. శ్రావణ్‌కుమార్ తెలిపారు. ప్రజలు కూడా మురుగు కాలువల్లో చెత్తా చెదారం వేయకుండా ఉండాలన్నారు.

పెరమనలో వైద్య శిబిరం


రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

సంగం, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెరమన గ్రామంలో జ్వరాలు ఎక్కువగా ఉన్నాయని సమాచారం అందడంతో బుధవారం వైద్య శిబిరం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా క్షేత్రస్థాయి వైద్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి లార్వా, మురికినీటి నిల్వ, జ్వరాలపై సర్వే చేశారు. అనంతరం జ్వరాలు ఉన్నవారికి వైద్య శిబిరంలో ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కాచి చల్లార్చిన నీటిని తాగాలని, దోమలు కుట్టకుండా దోమ తెరలు వాడాలని ప్రజలకు సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక పీహెచ్‌సీ డాక్టర్ అశోక్, ఎంపీహెచ్‌ఈవో మల్లెం కొండయ్య, హెల్త్ సూపర్‌వైజర్ ఆరోగ్య మేరీ, ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు మండల సమావేశం

ఆత్మకూరు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో మండలాధ్యక్షుడు కేతా వేణు గోపాల్‌రెడ్డి అధ్యక్షతన గురువారం ఉదయం మండల సరసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో పి ఐజాక్‌ప్రవీణ్ ఒక ప్రకటనలో తెలిపారు. కావున ప్రజా ప్రతినిధులు, మండల స్థాయి అధికారులు తప్పక హాజరు కావాలని ఆయన కోరారు.

నిర్వాసితులకు పరిహారం చెల్లించాలి


సబ్‌కలెక్టరు వినతిపత్రం ఇస్తున్న కాలనీ వాసులు

కందుకూరు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): రామాయపట్నం పోర్టు పరిధిలోని సాలిపేట బీసీ కాలనీని నిర్వాసిత గ్రామంగా గుర్తించి, అక్కడ నివసిస్తున్న కుటుంబాలకు పరిహారం చెల్లించాలని సీపీఎం ఆధ్వర్యంలో కాలనీవాసులు బుధవారం సబ్ కలెక్టరు శ్రీపూజకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పోర్టు నిర్మాణం కోసం, పోర్టుకు రైల్వేలైను నిర్మాణం కోసం మా భూములు తీసుకున్నారని, పోర్టు నిర్మాణం ప్రారంభించే సమయంలో మా కాలనీలో సర్వే చేసి ఇంటినెంబర్లు ఇచ్చారు కానీ పరిహారం చెల్లించలేదన్నారు. ఆర్‌ఆర్ ప్యాకేజీ అమలు చేయలేదని వారు ఆందోళన వ్యక్తం చేశారు. భూములన్నీ కోల్పోయాక తాము అక్కడ ఎలా జీవించాలో అధికారులు చెప్పాలని కోరారు. వాస్తవ పరిస్థితులను ఉన్నతాధికారులకు నివేదించి తమకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరారు. సబ్ కలెక్టరు మాట్లాడుతూ గ్రామాన్ని సందర్శించి వాస్తవ పరిస్థితులు ఉన్నతాధికారులకు నివేదిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి జీ. వెంకటేశ్వర్లు, సీఐటీయూ నాయకుడు జీవీబీ కుమార్, సాలిపేట గ్రామస్థులు అట్లా కోటయ్య, శ్రీరామమూర్తి, కే వాసుదేవరావు, ఎస్. కృష్ణ, చల్లా వేములస్వామి, బండారు రామారావు, నరేంద్ర, కే సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

రైతుల సమస్యపై సబ్ కలెక్టర్ స్పందన

- ఉలవపాడు: మండలంలోని భీమవరం రైతులు డొంక పోరంబోకు ఆక్రమణపై చేసిన ఫిర్యాదుపై సబ్‌కలెక్టర్ శ్రీపూజ స్పందించారు. బుధవారం డొంక బాటను తహసీల్దార్ లావణ్యతో కలిసి పరిశీలించారు. గ్రామానికి చెందిన కొందరు ఎండ్లబండ్లు వెళ్లేందుకు వీలులేకుండా ఆక్రమించుకొని, రైతులకు ఇబ్బందులు కలిగిస్తున్నారని సబ్‌కలెక్టర్‌కు గ్రామస్థులు వివరించారు. వెంటనే సర్వే చేపట్టి హద్దు రాళ్లు వేయాలని, ఉపాధి పనుల ద్వారా బాటను పునరుద్ధించాలని తహసీల్దార్, సర్వేయర్‌లను సబ్‌కలెక్టర్ ఆదేశించారు.

ముమ్మరంగా టీడీపీ సభ్యత్వ నమోదు


మాట్లాడుతున్న సుబ్బానాయుడు

కావలి, నవంబరు6 (ఆంధ్రజ్యోతి): సీఎం నారా చంద్రబాబు నాయుడు, మంత్రి లోకేష్‌ల ఆదేశాల మేరకు 60 శాతం లక్ష్యంగా టీడీపీ సభ్యత్వాలను ముమ్మరంగా చేపడుతున్నట్లు టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాలేపాటి సుబ్బానాయుడు పేర్కొన్నారు. కావలిలోని తన నివాసంలో బుధవారం ఆయన విలే కరులతో మాట్లాడారు. తన సోదరుడు మాలేపాటి రవీంద్ర నాయుడు దగదర్తి మండలంలో ఇళ్లిళ్లు తిరుగుతూ, ఇప్పటికే 5,500 సభ్యత్వాలు చేయించారన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో ఎక్కడా రోడ్లపై తట్టెడు మట్టి, కాలువల్లో పూడిక తీసిన పాపాన పోలేదన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఎక్కడా రోడ్లపై గుంటలు కనిపించకుండా మరమ్మతులు చేస్తున్నారని ఆయన తెలిపారు. ఉచిత ఇసుక పాలసీ ద్వారా ప్రజలపై భారం పడకుండా ఇసుక అందిస్తున్నామని చెప్పారు. దీపం పథకం ద్వారా ఏడాదికి మూడు ఉచిత సిలిండర్లు అమలు చేస్తున్నామని తెలిపారు.

మెనూ ప్రకారం భోజనం అందించాలి


విద్యార్థుల సమస్యలు తెలుసుకుంటున్న ఆర్డీవో

ఆత్మకూరు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): మున్సిపాల్టీ పరిధిలోని ప్రభుత్వ బాలికల గురుకుల పాఠశాలను బుధవారం ఆత్మకూరు ఆర్డీవో బి పావని తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి విద్యార్థులకు అందుతున్న భోజన నాణ్యత, బోధన అంశాలు, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించడంతో పాటు మెరుగైన విద్యను అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ కోటేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

దువ్వూరు కాలువకు నీటి విడుదల


నీటిని విడుదల చేస్తున్న అధికారులు, రైతులు

సంగం, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): సంగం వద్ద పెన్నానది నుంచి కొత్త రెగ్యులేటర్లు ఎత్తి దువ్వూరు కాలువకు బుధవారం నీటిని విడుదల చేశారు. సంగం బ్యారేజీ నిర్మాణంలో భాగంగా దువ్వూరు కాలువకు నూతన రెగ్యులేటర్లు నిర్మించారు. దువ్వూరు కాలువ పూడికతీత పనులు పూర్తికావడంతో మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ఆదేశాలు, ఆయకట్టు రైతుల కోరిక మేరకు డీఈ పెంచలయ్య ఆధ్వర్యంలో నూతన రెగ్యులేటర్లు ఎత్తి దువ్వూరు కాలువకు 100 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ఏఈ వినయ్ కుమార్, ఇరిగేషన్ సిబ్బంది, తరుణవాయి రైతులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాల ఏర్పాటుకు రూ.3 లక్షల విరాళం


ఇంటూరి సమక్షంలో విరాళం అందజేస్తున్న గోల్డ్‌మర్చంట్స్ అసోసియేషన్ ప్రతినిధులు

కందుకూరు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో శాంతి భద్రతలను కట్టుదిట్టం చేసే చర్యల్లో భాగంగా సీసీ కెమెరాల ఏర్పాటుకు గోల్డ్ మర్చంట్స్ అసోసియేషన్ ప్రతినిధులు రూ. 3 లక్షలు విరాళంగా అందజేశారు. బుధవారం వారు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావును మర్యాదపూర్వకంగా కలిసి ఆయన సమక్షంలో పోలీసు అధికారులకు విరాళాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో గోల్డ్ మర్చంట్స్ అసోసియేషన్ ప్రతినిధులు, డీఎస్పీ పీ బాలసుబ్రహ్మణ్యం, సీఐ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో 'పొలం పిలుస్తోంది'

కందుకూరు, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని దొండపాడు, ఆనందపురం గ్రామాల్లో మండల వ్యవసాయాధికారి వీ రాము ఆధ్వర్యంలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో మార్కెటింగ్ అధికారి షేక్ మాబాషా, వ్యవసాయ సహాయకులు సీహెచ్ బ్రహ్మయ్య, పశువైద్యాధికారి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

సస్యరక్షణ చర్యలతో అధిక దిగుబడులు

ఉదయగిరి రూరల్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): వరి సాగులో సస్యరక్షణ చర్యలు చేపడితే అధిక దిగుబడులు సాధించవచ్చని మండల వ్యవసాయాధికారి ఆంజనేయులనాయక్ పేర్కొన్నారు. బుధవారం మండలంలోని అప్పసముద్రం, కొండాయపాళెం పంచాయతీల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా పంచాయతీల్లో సాగులో ఉన్న వరి పంటను పరిశీలించి తెగుళ్లు, వాటి నివారణ చర్యల గురించి వివరించారు. అనంతరం రైతు సేవా కేంద్రాల్లో రైతులతో సమావేశం నిర్వమించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వీఏఏలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

వరిసాగులో మెలకువలు పాటించాలి

గుడ్లూరు, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): వరి పైరు సాగుచేస్తున్న రైతులు, తగిన మెలకువలు పాటించాలని మండల వ్యవసాయ అధికారి రవికుమార్ అన్నారు. మండలంలోని సాలిపేట, మోచర్ల గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు షారుక్‌ఖాన్, గ్రామ ఉద్యాన సహాయకురాలు రూస్సీ, యానిమల్ అసిస్టెంట్ ఎం. గోపి, ఆయా గ్రామాల రైతులు, సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

మామిడి సస్యరక్షణపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్

ఉలవపాడు, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): మామిడిసాగులో పూత, పిందె, కాయ దశ వరకు తీసుకోవాల్సిన సస్యరక్షణ చర్యలపై రైతులకు మండల వ్యవసాయ, ఉద్యాన అధికారులు బీ తిరుమల జ్యోతి, బీ జ్యోతి ఆధ్వర్యంలో పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. భీమవరం ఆర్‌ఎస్‌కే కేంద్రంలో బుధవారం జరిగిన రైతు శిక్షణలో కందుకూరు కేవీకే ప్రధాన సీనియర్ శాస్త్రవేత్త జీ ప్రసాద్ పాల్గొన్నారు. వరి, మామిడి పంటల సాగులో మెలకువలు, యాజమాన్య పద్ధతులు, జీవ రసాయన ఎరువుల వాడకంపై రైతులకు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ, ఉద్యాన సిబ్బంది వెంకట్రావు, శ్రీచరిత, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమి కబ్జా

పట్టించుకోని అధికారులు


ప్రభుత్వ భూమిలో దున్నుతున్న ట్రాక్టర్

అనంతసాగరం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ భూమి కబ్జా చేసి కంచె ఏర్పాటు చేయడంతో పాటు పంటసాగుకు పనులు చేస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. మండలంలోని బొమ్మవరంలో చెరువు లోతట్టున సర్వే నెంబరు 211లో 5 ఎకరాలు ప్రభుత్వ భూమిని కొందరు ఆక్రమించి సాగుకు ఉపక్రమించారు. ఈ ఆక్రమణ గురించి రెండు నెలల క్రితం ఆంధ్రజ్యోతి వెలుగులోకి తెచ్చింది. రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు పరిశీలించి ఆక్రమిత భూమిలో హెచ్చరిక బోర్డు పెట్టారు. అయితే ఆక్రమణదారులు బోర్డును తొలగించి బుధవారం ట్రాక్టరుతో దున్ని సాగు పనులు చేపట్టారు. ఈవిషయాన్ని అధికారులకు ఫిర్యాదు చేసినా స్పందన లేదని, చెరువు లోతట్టు ప్రాంతాలు అన్యాక్రాంతం కాకుండా చర్యలు చేపట్టాలని గ్రామస్థులు కోరుతున్నారు.

న్యూస్ బాక్స్

వీవోఏల నిరసన


వినతిపత్రం ఇస్తున్న వీవోఏలు

అనంతసాగరం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): వెలుగు వీవోఏల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. అనంతసాగరం వెలుగు కార్యాలయం వద్ద బుధవారం వారు నిరసన తెలిపి సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని ఏపీఎం రమణారావుకు అందజేశారు. సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు అన్వర్‌బాష, సౌభాగ్య పాల్గొన్నారు.

ఓటు కోసం దరఖాస్తు చేసుకోండి

వింజమూరు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : అర్హులందరూ ఓటు కోసం దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దారు హమీద్ సూచించారు. స్థానిక తహసీల్దారు కార్యాలయంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో తహసీల్దారు మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండిన వారు ఓటు కోసం దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. గ్రామాల్లో ఈనెల 9, 10, వచ్చేనెల 23, 24 తేదీలలో ప్రత్యేక శిబిరాలు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ సమావేశంలో బీఎల్‌ఓలు, కార్యాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల తనిఖీ


ఉపాధ్యాయులకు సూచనలు ఇస్తున్న ఉప విద్యాశాఖాధికారి

అనంతసాగరం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిలకలమర్రి ఉన్నత పాఠశాలను ఆత్మకూరు ఉప విద్యాశాఖాధికారి గోపాల్ బుధవారం సందర్శించారు. ఈసందర్భంగా రికార్డులు పరిశీలించి విద్యార్థుల విద్యా సామర్థ్యాలను ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో నాడు-నేడు పనులను పరిశీలించారు. కార్యక్రమంలో హెచ్ఎం మహేష్ పాల్గొన్నారు.

చోరీ కేసు విచారణ ముమ్మరం

లింగసముద్రం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద పవనిలో టీడీపీ నేత రామిశెట్టి మాలకొండయ్య ఇంట్లో జరిగిన భారీ దొంగతనం కేసును పోలీసులు ముమ్మరంగా విచారిస్తున్నారు. గుడ్లూరు సీఐ మంగారావు, ఎస్సై షేక్ మహబూబ్ సుభానిల ఆధ్వర్యంలో బుధవారం పెదపవనిలో మాలకొండయ్య ఇంటిని మరోసారి పరిశీలించారు. గుడ్లూరు మండలంలోని నరసాపురం చెక్‌పోస్టు వద్ద, కావలి రూరల్ మండలం కొత్తపల్లి వద్ద ఉన్న సీసీ కెమెరాలను సీఐ ఎస్సైలు పరిశీలించారు. బాధితుడితో కూడా ఈ కేసు విషయమై మాట్లాడారు. కాగా ఒక పాత నేరస్థుడు, మరో ముగ్గురు బయటి వ్యక్తులు మాలకొండయ్య ఇంటికి సమీపంలోని పాత హైస్కూల్ వద్ద మద్యం సేవించినట్టు పోలీసులకు కొందరు గ్రామస్థులు చెప్పినట్టు తెలిసింది. అయితే బాగా తెలిసిన వ్యక్తులే చోరీ చేసినట్టుగా పలువురు చర్చించుకుంటున్నారు. ఈ కేసు పోలీసు లకు సవాల్‌గా నిలిచింది.

నెల్లూరు సిటీ

రూరల్, కోవూరు, సర్వేపల్లి

న్యూస్ బాక్స్

'డిప్యూటీ సీఎంపై విమర్శలు తగవు'

వెంకటాచలం, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): డిప్యూటీ సీఎం, జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్‌పై మంద కృష్ణ మాదిగ విమర్శలు చేయడం సరికాదని జనసేన పార్టీ మండల ప్రధానకార్యదర్శి కాకి శివకుమార్ అన్నారు. వెంకటాచలంలోని ఆపార్టీ కార్యాలయంలో బుధవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ అంటే తమ పార్టీ అధినేతకు ఎంతో గౌరవమని, అలాంటి వ్యక్తి తమ పార్టీ అధినేతపై కులం పేరుతో విమర్శలు చేయడం మంచికాదన్నారు. జనసేన నుంచి మాల మాదిగలను దూరం చేసే విధంగా వ్యవహరిస్తున్నారన్నారు. గతంలో అనేకమార్లు జనసేన పార్టీ ఎస్సీ వర్గీకరణకు మద్దతు పలికిందన్నారు. ఆ విషయం ఆయనకు తెలియదా అని ప్రశ్నించారు. కుల రాజకీయాలు చేయడం కానీ, రాజకీయాల్లో కులాలను మధ్యలోకి లాగడం సరికాదన్నారు. ఈ సమావేశంలో ఆస్తోటి రవికుమార్ తదితరులున్నారు.

ఎంఈవో కార్యాలయానికి బీరువా బహూకరణ

బుచ్చిరెడ్డిపాళెం, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): బుచ్చిరెడ్డిపాళెం మండల విద్యాశాఖ కార్యాలయానికి బుధవారం బుచ్చి పాతకాశీపాళెంకు చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడు బొజ్జా వెంకటరమణయ్య బీరువా బహూకరించారు. ఈ సందర్భంగా దాతను ఎంఈవోలు దిలీప్‌కుమార్, పీవీ.రత్నం, ఉపాధ్యాయులు శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు.

శవ రాజకీయాలు చేయడం హేయం : మైనార్టీ నేతలు

విడవలూరు, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): ప్రశాంతంగా ఉన్న ఊటుకూరులో కొందరు వ్యక్తులు శవ రాజకీయాలు చేయడం సరికాదని విడవలూరు, కొడవలూరు మైనార్టీ నాయకులు పేర్కొన్నారు. ఊటుకూరులో బుధవారం జరిగిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ రెండు రోజుల క్రితం నివాస గృహాల సమీపంలో మృతదేహాన్ని పూడ్చారని కొందరు వ్యక్తులు నానా హంగమా చేశారన్నారు. వాస్తవానికి మైనార్టీలకు కేటాయించిన శ్మశానంలోనే మృతదేహాన్ని పూడ్చారన్నారు. ఎన్నో సంవత్సరాలుగా ప్రభుత్వం కేటాయించిన శ్మశానంలోనే కర్మకాండలు చేస్తూ వస్తున్నామని, అయితే దానికి సమీపంలో నివాసం ఉంటున్న కొందరు శ్మశానాన్ని ఆక్రమించుకుంటున్నారని, అందులో భాగంగానే శవరాజకీయాలకు తెరతీశారన్నారు. శ్మశానాన్ని ఆక్రమించుకుంటున్నారని గతంలో రెవెన్యూ అధికారులకు ఫిర్యాదులు చేశామన్నారు. దీంతో అన్నదమ్ముల్లాగా ఉన్న హిందు, ముస్లింల మధ్య గొడవలు సృష్టించాలనే దురుద్దేశ్యంతో కొందరు రాజకీయాలు చేస్తున్నారని ఆరోపించారు. ఈ విషయాన్ని ఎమ్మెల్యే దృష్టికి తీసుకుని పోతామన్నారు. ఈ సమావేశంలో మైనార్టీ నాయకులు ఖలీల్‌బాషా, కాలేషా, మాలిక్, మస్తాన్, తదితరులు పాల్గొన్నారు.

కేంద్రాలకు చిన్నారులను పంపండి

మనుబోలు, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): మూడేళ్ల చిన్నారులను తప్పకుండా తల్లిదండ్రులు అంగన్‌వాడీ కేంద్రాలకు పంపాలని సీడీపీవో విజయలక్ష్మి కోరారు. మండలంలోని కాగితాలపూరు, లక్ష్మీనరసింహపురం అంగన్‌వాడీ కేంద్రాలను బుధవారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ రమణమ్మ, కార్యకర్తలు విజయమ్మ, రేవతి, ఏఎన్ఎం. జయరావమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల అభివృద్ధికి కృషి : సోమిరెడ్డి

తోటపల్లిగూడూరు, నవంబరు 6(ఆంధ్రజ్యోతి) : దేవాలయాల అభివృద్ధికి తనవంతు కృషి చస్తానని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి పేర్కొన్నారు. మండలకేంద్రంలోని తోటపల్లిగూడూరులో వెలిసివున్న శ్రీఖరేశ్వరస్వామి ఆలయంలో బుధవారం కార్తీక మాసం పురస్కరించుకుని ప్రముఖ పారిశ్రామికవేత్త మారంరెడ్డి గోపాల్‌రెడ్డి అల్లుడు ఆనం మహేష్‌రెడ్డి కుటుంబ సభ్యుల సహకారంతో ఆలయంలో నూతన ధ్వజస్తంభం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సోమిరెడ్డి పాల్గొన్నారు. ధ్వజస్తంభం ఏర్పాటు చేసి, ఈ ఆలయానికి వసతులు కల్పించిన ఆనం మహేష్‌రెడ్డిని, కుటుంబ సభ్యులను అభినందించారు. ప్రతి ఒక్కరూ దైవచింతన కలిగి ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బొమ్మి సురేంద్ర, మండల అధ్యక్షుడు సన్నారెడ్డి సురేష్‌రెడ్డి, నాయకులు ముత్యాల శ్రీనివాసులు, మన్నెం కిరణ్, మన్యం జితేంద్ర, శంకర్‌రెడ్డి, సంజిత్‌రెడ్డి, తదితర నాయకులు పాల్గొన్నారు.



నూతన ధ్వజస్తంభం పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే సోమిరెడ్డి

శరవేగంగా లక్ష దీపోత్సవ ఏర్పాట్లు

నెల్లూరు (హరనాథపురం), నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి, కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి దంపతుల సహకారంతో వీపీఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నగరంలోని వీఆర్సీ మైదానంలో జరగనున్న కార్తీక మాస లక్ష దీపో త్సవానికి ఏర్పాట్లు శరవేగంగా సాగుతు న్నాయి. ఈనెల 8, 9, 10 తేదీల్లో ఈ కార్యక్రమం జరగనుంది. ప్ర ధాన వేదికతోపాటు దీపోత్స వానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా లైటింగ్ పనులు చేస్తున్నారు. యాగశాల నిర్మాణం దాదాపు పూర్తయింది. ఈ ఏడాది త్రయంబ కేశ్వరంలోని శివుడి నమూనా, అయో ధ్య రామాలయం నమూనా ప్రత్యేక ఆకర్షణగా నిలవ నున్నాయి.



అయోధ్య రామాలయం నమూనా

● వేమిరెడ్డి ప్రమాణ స్వీకారంలో..

టీటీడీ పాలక మండలి సభ్యురాలిగా కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి బుధవారం తిరుమలలో ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, తనయుడు అర్జున్‌రెడ్డి, కుమార్తె నీలిమారెడ్డి పాల్గొన్నారు. టీడీపీ నాయకులు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, కోడూరు కమలాకర్‌రెడ్డి తదితరులు వేమిరెడ్డి దంపతులను ఘనంగా సత్కరించారు. కేతంరెడ్డి వినోద్‌రెడ్డి, చైతన్యకృష్ణ, వంశీరెడ్డి, సూరా శ్రీనివాసులురెడ్డి, చెంచు కిషోర్, జెట్టి రాజగోపాల్, మదన్‌రెడ్డి, మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భూ రీ సర్వే తప్పుల తడక!

● మారిన సర్వే నెంబర్లు
● యజమానుల స్థానంలో ఇతరుల పేర్లు
● లబోదిబోమంటున్న రైతులు

కోవూరు, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వం అమలులోకి తీసుకవచ్చిన భూ రీసర్వే ఆద్యంతం తప్పుల తడగా మారింది. పలుచోట్ల పొలాల సర్వే నెంబర్లు మారిపోయాయి. రైతులు ఎప్పటి నుంచో తమ అనుభవంలో ఉన్న పొలాలకు పట్టాదారు పుస్తకాలు తీసుకుని పెద్దసంఖ్యలో రైతులు బ్యాంకుల్లో పంట రుణాలు కూడా తీసుకున్నారు. ఆరు నెలల కిందట రీ సర్వే పేరుతో పొలాల్ని కొలచి కొత్త ఎల్‌పీఎం నెంబర్లను కేటాయించారు. ఈ క్రమంలో ఇద్దరి ముగ్గురికి ఒకే ఎల్‌పీఎం నెంబరు కేటాయించడంతో వారి పేరుతో 1బీ, అడంగల్ కూడా రావడం లేదు. ఈ విషయం ఇప్పటికీ చాలా మంది రైతులకు తెలియదు. పట్టాదారు పుస్తకాల్లో, 1బీల్లో తమ పేర్లు, సర్వే నెంబర్లు యధాతథంగా కొనసాగుతున్నాయని రైతులు భావిస్తున్నారు. రెవెన్యూ రికార్డులు పరిశీలించిన రైతులు మాత్రం తికమకకు గురవుతున్నారు. భూ హక్కు కలిగిన రైతుల్ని తొలగించి అనుభవంలో లేని వ్యక్తుల పేర్లు పలుగ్రామాల్లో సర్వే అధికారులు నమోదు చేశారు. మండల పరిధిలోని ప్రతి గ్రామంలోనూ పెద్దసంఖ్యలో పొలాల సర్వే నెంబర్లు మారిపోయాయని రైతులు లబోదిబోమంటున్నారు. రీసర్వే తమకు కొత్త కష్టాల్ని తెచ్చిపెట్టిందని రైతులు వాపోతున్నారు. అయితే తమ పేరుతో ఉన్న భూములకు సంబంధించి నెలకొన్న తప్పిదాలు తెలియని రైతులు గ్రామాల్లో జరుగుతున్న రీ సర్వే రెవెన్యూ గ్రామసభలపై కూడా అంతగా ఆసక్తి చూపడం లేదు. ప్రస్తుతం మారిన నెంబర్లు, జాయింట్ ఎల్‌పీఎంలు, ఇతరితర తప్పులు సరిదిద్దుకోవాలంటే రైతులకు ఆర్థికభారం అధికమైంది. దీంతో తహసీల్దారు కార్యాలయం చుట్టూ తిరుగుతూ తీవ్ర అవస్థలు పడుతున్నారు. రీసర్వేలో పొందుపరచిన సర్వే నెంబర్లకు తాము, తమ పూర్వీకులు కొనుగోలు చేసిన పొలాల సర్వే నెంబర్లకు పొంతన కుదరడంలేదని పలువురు రైతులు వాపోతున్నారు. ఈ సమస్యను పరిష్కరించడం రెవెన్యూ అధికారులకు కష్టతరంగా మారింది. రీ సర్వే వల్ల వచ్చిన కష్టాల్ని రెవెన్యూ అధికారులు, సిబ్బంది ఓపికగా పరిష్కరించాలని రైతులు కోరుతున్నారు.



భూమి రీసర్వే చేస్తున్న అధికారులు, సిబ్బంది (ఫైల్)

తప్పులు సరిదిద్దాలి



రీ సర్వేతో రైతులు బాగా ఇబ్బందిపడుతున్నారు. సర్వే నెంబర్లు మారిపోయాయి. కొత్త నెంబర్లకు, పూర్వీకుల నుంచి పొందిన పొలాల సర్వే నెంబర్లకు పొంతన కుదరడంలేదు. ఒక్కసారిగా 1బీలో నెంబర్లు కూడా మారిపోయాయి. రీ సర్వే వల్ల రైతులకు తీవ్ర నష్టమే జరిగింది. రీ సర్వే తప్పులను అధికారులు సరిదిద్దాలి.

- జక్కంరెడ్డి భాస్కర్‌రెడ్డి, రైతు, కోవూరు.

లోపాలు గుర్తించాలి



రీ సర్వేలో జరిగిన లోపాలను గుర్తించాలి. పట్టాదారు పుస్తకాల్లోని వివరాలతో కొత్త సర్వేలోని సర్వే నెంబర్లు సరిపోల్చలేక పోతున్నాం. రీ సర్వేలో భూయజమానుల పేర్లు కూడా మారిపోయాయి. ఎవరికి ఫిర్యాదు చేసినా ఫలితం కన్పించడం లేదు. మార్పులు చేస్తామని అధికారులు చెబుతున్నప్పటికీ కార్యరూపం దాల్చడంలేదు.

- సింహాద్రి అయ్యప్ప, రైతు, అన్నారెడ్డి పాళెం.

అన్నీ సరిదిద్దుతున్నాం



మండల పరిధిలోని గ్రామాల్లో రీ సర్వేతో తలెత్తిన సమస్యలన్నింటినీ సరిదిద్దుతున్నాం. గ్రామ సభల్లో సమస్యలు తెలుసుకుంటున్నాం. రీ సర్వేలో పలు కారాణాల వల్ల పొరబాట్లు దొర్లాయి. వాటిని పరిశీలించి రైతులు తమ సమస్యల్ని మా దృష్టికి తీసుకువస్తే సరిదిద్దుతాం. ఈ విషయంలో ఆందోళన చెందాల్సిన అవసరం లేదు.

- నిర్మలానంద బాబ, తహసీల్దారు, కోవూరు.

వరిలో యాజమాన్య పద్ధతులు పాటించాలి

● జిల్లా వ్యవసాయ అధికారి సత్యవాణి

తోటపల్లిగూడూరు, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): వరిలో యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు పొందవచ్చని జిల్లా వ్యవసాయ అధికారి పీ.సత్యవాణి పేర్కొన్నారు. బుధవారం మండలంలోని కోడూరు బిట్ 1, 2లో జరిగిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని రైతులకు మేలైన వరి రకాల ఎంపిక, విత్తనశుద్ధి, నాట్లు వేయాల్సిన సమయం, ఎరువుల యాజమాన్యం గురించి రైతులకు వివరించారు. సహాయ వ్యవసాయ సంచాలకులు నర్సోజీరావు మాట్లాడుతూ నారుమడుల యాజమాన్యం గురించి రైతులకు వివరించారు. అనంతరం నాట్లు వేసిన వరి పొలాలను సందర్శించారు. రబీలో వరి సాగు చేసే రైతులు డిసెంబరు 31లోపు మీసేవ కేంద్రం లేదా బ్యాంకులలో రూ.420 చొప్పున హెక్టారుకు ప్రీమియం ధర చెల్లించి ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకం కింద, పంటల బీమా నమోదు చేసుకోవాలని తెలిపారు. ఒకవేళ వరి పైరుకు ఏదైనా నష్టం జరిగితే రూ.1,05,000 బీమా వస్తతందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి శిరీష, వీఏఏలు దయానా శశి, మత్స్యశాఖ వీఎఫ్ఏ సుప్రియ పాల్గొన్నారు.

నెహ్రూ, ఇందిర విగ్రహాల వద్ద శుభ్రం చేయండి

● కమిషనర్‌కు కాంగ్రెస్ నాయకుల వినతి

నెల్లూరు(వైద్యం), నవంబరు 6(ఆంధ్ర జ్యోతి): ఈ నెల 14న దేశ తొలి ప్రధాని జవహర్ లాల్ నెహ్రూ, 19న దివంగత ప్రధాని ఇందిరాగాంధీ జయంతి సందర్భంగా నగరంలోని వారి విగ్రహాల వద్ద శుభ్రం చేయాలని కాంగ్రెస్ నాయకులు కోరారు. ఈ మేరకు నగర కమిషన ర్ సూర్యతేజకు బుధవారం వినతిపత్రం అందిం చారు. పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు తలారి బాల సుధాకర్, నాయకులు షేక్ అల్లాఉద్దీన్, అరవ రామ్మోహన్, మల్లి కార్జునరెడ్డి, ఆదినారాయణ, బద్రి మల్లికార్జునరావు, షేక్ సమీర్ తదితరులు పాల్గొన్నారు.



కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న నేతలు

మహిళా పోలీసుస్టేషన్ సీఐగా సుబ్బారావు

నెల్లూరు(క్రైం), నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): నెల్లూరు మహిళా పోలీసుస్టేషన్ సీఐగా సుబ్బారావు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయనకు సిబ్బంది పుష్పగుచ్ఛాలు అందచేసి శుభాకాంక్షలు తెలిపారు. సుబ్బారావు గతంలో నవాబుపేట ఇన్‌స్పెక్టర్‌గా పని చేశారు.

3 రోజుల్లోనే తూము ఏర్పాటు

మనుబోలు, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): మనుబోలు పెద్దచెరువు నుంచి మాగాణికి నీరుపారే తూమును మూడు రోజుల్లోనే ఏర్పాటు చేశారు. దీనిని నీటిపారుదల శాఖ ఏఈ కృష్ణ బుధవారం పరిశీలించి ప్రారంభించారు. ఆయన వెంట టీడీపీ నేత పచ్చిపాల రామిరెడ్డి, తదితరులు ఉన్నారు.

ఓటరు నమోదు కేంద్రం ఏర్పాటు

నెల్లూరు (వెంకటేశ్వరపురం), నవంబరు 6(ఆంధ్రజ్యోతి): నెల్లూరు రూరల్ నియోజకవర్గం పరిధిలోని 287వ పోలింగ్ బూత్ ప్రజల కోసం ఓటరు నమోదు కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు నెల్లూరు ఆర్డీవో నాగ సంతోష్ అనూష ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 9,10,23,24 తేదీల్లో ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు బీఎల్‌వోలు అందుబా టులో ఉంటారని తెలిపారు. ఈ అవకాశాన్ని 287వ బూత్ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

'శ్రీచైతన్య'లో రక్తదానం

నెల్లూరురూరల్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): నెల్లూరు రూరల్లోని ధనలక్ష్మీపురం వద్దనున్న శ్రీచైతన్య స్కూల్లో బుధవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. శ్రీచైతన్య విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ ఝాన్సీ లక్ష్మీబాయి జన్మదినాన్ని పురస్కరించుకుని ఈ శిబిరం ఏర్పాటు చేశారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ప్రముఖ పల్మనాలజిస్టు పొకల రవి మాట్లాడుతూ రక్తదాన శిబిరం ఏర్పాటును అభినందించారు. అనంతరం రక్తదాతలను అభినందించారు. ఈ కార్యక్రమంలో విద్యా సంస్థల ఏజీఎంలు శ్రీకాంత్, కొండారెడ్డి, డీన్ శ్రీరాములు, కోఆర్డనేటర్స్ బాషా, నాగరాజు, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

స్త్రీనిధి బకాయిలు వసూలు చేయాలి

విడవలూరు, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): స్త్రీనిధి బకాయిలను త్వరితగతిన వసూలు చేయాలని స్త్రీనిధి అసిస్టెంట్ జనరల్ మేనేజరు కామాక్షయ్య తెలిపారు. స్థానిక వెలుగు కార్యాలయంలో సంఘమిత్ర ఓబీలు, వీవోఏలతో బుధవారం ఆయన సమీక్షా సమావేశం నిర్వ హించారు. ఈ సందర్భంగా అయన మాట్లా డుతూ పొదుపు గ్రూపులకు స్త్రీనిధి కింద అందజేసిన నగదు వసూలు కొన్ని గ్రామాల్లో మందకొడిగా జరుగుతుందన్నారు. ఈనెల 15 లోగా బకాయిలను వసూలు అయ్యేలా ఎంపీ ఎం, సీసీలు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాల న్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం వెంకమ్మ, సీసీలు శివ, వెంకటేశ్వర్లు, మమత, శ్రీదేవి, సుకుమార్, చంద్రయ్య పాల్గొన్నారు.

ఒక్కో డివిజన్ అభివృద్ధికి రూ. కోటి

● రూరల్ ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి

నెల్లూరు రూరల్ (ఆంధ్రజ్యోతి): నెల్లూరు రూరల్లోని ఒక్కో మున్సిపల్ డివిజన్‌ను రూ.కోటితో అభివృద్ధి చేస్తామని రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి తెలిపారు. బుధవారం 30వ డివిజన్ నక్కా గోపాల్ నగర్‌లో రూ.35 లక్షలతో చేపట్టిన సీసీరోడ్లు, పైపులైన్ల పనులకు ఆయన శంకుస్థాపన చేసి మాట్లాడారు. తన నియోజక వర్గంలోని డివిజన్లకు రూ. కోటితో అభివృద్ధి పనులకు ప్రణాళికలు తయారు చేస్తున్నా మన్నారు. ప్రజల అవసరాలను గుర్తించి అవన్నీ పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు.



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్నకోటంరెడ్డి

10న బలిజల కార్తీక వనభోజనాలు

నెల్లూరు (సాంస్కృతికం), నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) :నగరంలోని బలిజ భవన్‌లో జిల్లా బలిజ సంఘీయుల కార్తీక వన భోజన కార్యక్రమం ఈ నెల 10వ తేదీన జరుగుతుందని కాప్స్‌రాక్ నాయకుడు పత్తి మల్లికార్జునరావు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా గాయత్రీ హోమం, శివాభిషేకం, గోపూజ, ఉసిరిక వృక్ష పూజ, ఆటల పోటీలు జరుగు తాయని తెలిపారు. మంత్రి పొంగూరు నారాయణ, రమాదేవి దంపతులు హాజరవుతారని, శ్రీకృష్ణదేవరాయ విగ్రహా ఆవిష్కరణ జరుగుతుందన్నారు.

బీపీటీ రకం వరి నార్లు పోసుకోవాలి

ముత్తుకూరు (ఆంధ్రజ్యోతి) : రబీ సీజన్‌లో బీపీటీ 5204 రకం వరి సాగు చేసే రైతులు వెంటనే వరి నార్లు పోసుకోవాలని ఇందుకూరుపేట ఏడీఏ రాజ్‌కుమార్ సూచించారు. బ్రహ్మదేవం, పిడతాపోలూరు రైతు సేవా కేంద్రంలో బుధవారం నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఏవో జోత్స్నరాణి, ఇఫ్కో మేనేజర్ లక్ష్మీనారాయణ, వీఏఏలు ప్రసన్న, నవీన్, కరిముల్లా పాల్గొన్నారు.



ముత్తుకూరు : వరినారును పరిశీలిస్తున్న అధికారులు

● ఇందుకూరుపేట(ఆంధ్రజ్యోతి) : మండలంలోని పున్నూరు, లేబూరు బిట్-1 గ్రామాల్లో మండల వ్యవసాయాధికారి రఘునాథరెడ్డి ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి పీ.సుమలత, పున్నూరు వీఏఏలు నరేష్, సుమలత పాల్గొన్నారు.

పీహెచ్‌సీని సందర్శించిన జిల్లా నోడల్ అధికారి

ఇందుకూరుపేట, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని జగదేవిపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని బుధవారం ఎఫ్‌డీసీ జిల్లా నోడల్ అధికారి డాక్టర్ పీఎల్ దయాకర్ సందర్శించి రికార్డులు పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 24గంటలు వైద్య సిబ్బంది విధుల్లో ఉండాలని, ఆసుపత్రిలో కాన్పులు ఎక్కువ సంఖ్యలో జరగాలన్నారు. ఈ కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సి.కిషోర్ కుమార్, హెల్త్ ఎడ్యుకేటర్ సుధాకర్‌రావు, ఫార్మసీ ఆఫీసర్ చంద్రశేఖర్, ల్యాబ్ టెక్నీషియన్ హైమావతి, స్టాఫ్ నర్సులు రమీజా, శివజ్యోతి, ఎఫ్ఎన్‌వో దివ్య, తదితరులు పాల్గొన్నారు.



రికార్డులు పరిశీలిస్తున్న డాక్టర్ దయాకర్

మద్యం దుకాణం తొలగించండి

నెల్లూరు(క్రైం), నవంబరు 6(ఆంధ్రజ్యోతి): నగరంలోని వాకర్స్ రోడ్డు, పరమేశ్వరి నగర్ వద్ద ఏర్పాటు చేసిన మద్యం దుకాణాన్ని తొలగించాలని స్థానికులు రెండు రోజులుగా చేస్తున్న ఆందోళన బుధవారం ఉద్రిక్తంగా మారింది. ఆందోళనకు అధికారులు, వ్యాపారి స్పందించకపోవడంతో బుధవా రం షాపు ఎదుట బైఠాయించి పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. సమాచారం అందుకున్న చిన్నబజారు సీఐ చిట్టెం కోటేశ్వరరావు తన సిబ్బందితో కలిసి ఘటనా స్థలానికి చేరుకొని ఆందోళన చేస్తున్న వారితో మాట్లాడారు. సమస్యను కలెక్టర్, ఎక్సైజ్ అధికారుల దృష్టికి తీసుకెళతానని హామీ ఇవ్వడం తో స్థానికులు ఆందోళన విరమించారు. జేసీ, డీఆర్వో, ఎక్సైజ్ అధికారులకు వినతి పత్రం సమర్పించి, మద్యం దుకాణం తొలగించాలని కోరారు.

స్కానింగ్ కేంద్రాల్లో ఆకస్మిక తనిఖీలు



స్కానింగ్ కేంద్రాలను తనిఖీ చేస్తున్న అధికారులు

నెల్లూరు (వైద్యం), నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని పలు స్కానింగ్ కేంద్రాలను వైద్యాధికారులు బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రైమ్ చిల్డ్రన్స్ ఆసుపత్రి, గాయత్రి స్కానింగ్ సెంటర్, జీకే ఆసుపత్రి, సాయి చేతన్ ఆసుపత్రిలోని స్కానింగ్ కేంద్రాలను తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. ఫాం-ఎఫ్‌ను తనిఖీ చేశారు. వైద్య ఆరోగ్యశాఖ జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ రమేష్ మాట్లాడుతూ స్కానింగ్ కేంద్రాల నిర్వాహకులు ఎట్టి పరిస్థితిలో లింగ నిర్ధారణ పరీక్షలు చేయరాదని హెచ్చరించారు. స్కానింగ్ పరీక్షలు నిర్వహించిన ప్రతి మహిళ వివరాలు ఆన్లైన్‌లోని పోర్టల్‌లో నమోదు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా మాస్ మీడియా అధికారి కనకరత్నం, మునిమహేష్ తదితరులు పాల్గొన్నారు.

జనసేన కార్యాలయంలో ఫిర్యాదుల స్వీకరణ

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): జనసేన పార్టీ జిల్లా కార్యాలయంలో బుధవారం జనవాణి కార్యక్రమాన్ని జిల్లా ప్రధాన కార్యదర్శి గునుకుల కిషోర్ నిర్వహిం చారు. పలువురు ప్రజలు వారి సమస్యలు తెలుపుకున్నారు. కిషోర్ మాట్లాడుతూ ప్రతీ బుధ, శనివారాల్లో ప్రజలకు అందుబాటులో ఉంటూ 'జనవాణి' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నా మని చెప్పారు. మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి తన నోటి కంపు చూసుకోకుండా అందరి నోళ్ల వాసన చూసే పనిలో నిగమ్నమయ్యారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో నాయకులు సుందరరామిరెడ్డి, వెంకటేశ్వర రావు పాల్గొన్నారు.

మధు డ్యాన్స్ అకాడమీ ప్రారంభం

నెల్లూరు(సాంస్కృతికం), నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): నగరంలోని మాగుంట లే అవుట్‌లో మధు డ్యాన్స్ అకాడమీని టీడీపీ నేత కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి బుధవారం ప్రారంభించారు. కళాకారులను ఒకచోట చేర్చి ప్రోత్సహించేందుకు డ్యాన్స్ అకాడమీని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. నాయకులు నూకరాజు మదన్‌మోహన్‌రెడ్డి, షంషుద్దీన్, చక్రవర్ధన్ రెడ్డి, డ్యాన్స్ అకాడమీ డైరెక్టర్ మధు పాల్గొన్నారు.

అయ్యప్పలకు అన్నప్రసాద వితరణ

నెల్లూరు (సాంస్కృతికం), నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): నగరంలోని అయ్యప్పగుడిలో బుధవారం కార్తీకమాసం సందర్భంగా అయ్యప్పలకు భారీగా అన్నప్రసాద వితరణ జరిగింది. నగరం నలుమూలల నుంచి భక్తులు విచ్చేశారు. ఆలయ చైర్మన్ జీ శేషగిరిరావు, కార్యదర్శి కత్తుల వెంకటరత్నం, కోశాధికారిగా గడ్డం రత్నయ్య పర్యవేక్షించారు.



అన్నప్రసాదం స్వీకరిస్తున్న అయ్యప్ప భక్తులు

నిరాడంబరంగా ప్రమాణ స్వీకారం



శ్రీవారి ఆలయం ముందు ప్రజాప్రతినిధులు, నేతలు, అధికారులు, కుటుంబీకులతో టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు

- క్షేత్రసంప్రదాయాన్ని పాటిస్తూ శ్రీవారి దర్శనం చేసుకున్న టీటీడీ చైర్మన్

తిరుమల, నవంబరు6 (ఆంధ్రజ్యోతి): టీటీడీ ధర్మకర్తల మండలి ప్రమాణ స్వీకారం బుధవారం నిరాడంబరంగా జరిగింది. తిరుమల శ్రీవారి ఆలయంలో ఉదయం చైర్మన్ బీఆర్ నాయుడు, మరో 15 మంది సభ్యులు, ఎక్స్ అఫిషియో సభ్యుడిగా దేవదాయ శాఖ కార్యదర్శి ప్రమాణ స్వీకారం చేశారు. సంప్రదాయ వస్త్రధారణ, నుదుట నామంతో క్షేత్రం సంప్రదాయాన్ని పాటిస్తూ బీఆర్ నాయుడు తొలిగా పుష్కరిణి నీటి ప్రోక్షణ చేసుకుని వరాహస్వామిని దర్శించుకున్నారు. తర్వాత కూలైన్‌లో ఆలయంలోకి వెళ్లి ప్రమాణస్వీకారం చేశాక శ్రీవారిని దర్శించుకున్నారు. సాధారణంగా చైర్మన్ అంటే పుష్పగుచ్చాలు అందజేసి, పట్టువస్త్రాలతో సత్కరించే హడావుడి అధికంగా ఉంటుంది. ఈయన మాత్రం బొకే సంప్రదాయం వద్దని నిరాకరించడంతో ఆలయం ముందు ఎలాంటి హడావుడి కనిపించ లేదు. ఆలయం ముందూ ఎలాంటి ప్రసంగాలు చేయకుండా వెళ్లిపోయారు. ఇక సభ్యుల్లోనూ రాజకీయ నాయకులున్నా కార్యకర్తల హడావుడి కనిపించలేదు. తొలిరోజే సభ్యులు, టీటీడీలోని పలు విభాగాల అధికారులతో చైర్మన్ సమీక్షించారు. ఆయా విభాగాలు చేపడుతున్న కార్యక్రమాలపై అవగాహన పెంచుకునేందుకు సుదీర్ఘంగా సమావేశాన్ని నిర్వహించారు. భక్తులకు చేపట్టాల్సిన సౌకర్యాలపై చర్చించడంతో పాటు గతంలో తలెత్తిన ఇబ్బందులు, విమర్శలపైనా మాట్లాడారు.

నేడు మరో ముగ్గురు మిగిలిన సభ్యుల్లో ఫార్మా రంగానికి చెందిన సుచిత్ర ఎల్లా, స్థానిక బీజేపీ నేత భానుప్రకాష్‌రెడ్డి, ముని కోటేశ్వరరావు గురువారం ప్రమాణం చేయనున్నారు. వీరితో పాటు కృష్ణమూర్తి వైద్యనాథన్ కూడా ప్రమాణం చేయాల్సి ఉన్నప్పటికీ ఆయన నుంచి ఎలాంటి స్పందన రాలేదు. ఇక, జ్యోతుల నెహ్రూ, పనబాక లక్ష్మి, సదాశివరావు శుక్రవారం ప్రమాణం చేయనున్నారు.

వారం రోజుల్లో 93,203 బుకింగ్స్

- ఉచిత గ్యాస్‌కు అనూహ్య స్పందన
- 62,300 మందికి సిలిండర్ల డెలివరీ
- 26,100 మంది ఖాతాల్లో నగదు జమ

తిరుపతి(నేరవిభాగం), నవంబరు 6(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఉచిత గ్యాస్ బుకింగ్‌కు అనూహ్య స్పందన కనిపిస్తోంది. దీపం-2 కింద ఉచిత గ్యాస్ సిలిండర్ పథకం అమల్లోకి వచ్చిన వారం రోజుల్లో 93,203 మంది బుక్ చేసుకున్నారు. ఒక్కో ఏజెన్సీ నుంచి నగరాలు, పట్టణాల్లో అయితే రోజుకు సగటున 450 నుంచి 500.. గ్రామీణ ప్రాంతాల్లో 300 వరకు సిలిండర్లు బుక్ అవుతున్నట్లు గ్యాస్ ఏజెన్సీల నిర్వాహకులు చెబుతున్నారు. ఇందులో 45 నుంచి 50 శాతం వరకు ఉచిత గ్యాస్ బుకింగ్‌లు జరుగుతున్నాయి. ఈ లెక్కన వారం రోజుల వ్యవధిలో 62 ఏజెన్సీల ద్వారా దాదాపు 93,203 మంది ఉచిత గ్యాస్ కనెక్షన్ల కోసం బుక్ చేసుకున్నారు. అందులో 62,300 మందికి సిలిండర్లు డెలివరీ అయ్యాయి. వీరిలో చాలా మంది ఈకేవైసీ చేసుకోకపోవడంతో ఇప్పటి వరకు 26,100 మందికి మాత్రమే నగదు జమైంది. మిగిలిన వారు ఈకేవైసీ చేసుకోవాలని, రానున్న మూడు నెలల వ్యవధిలో అందరికీ నగదు జమ చేస్తామని అధికారులు చెబుతున్నారు. ఇప్పటి వరకు నగదు జమకాని వారు సంబంధిత గ్యాస్ ఏజెన్సీలను, డీఎస్‌వోను సంప్రదించి సందేహాలు నివృత్తి చేసుకోవచ్చని జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారులు సూచించారు.

అనుమానాలుంటే నివృత్తి చేసుకోండి

గ్యాస్ కనెక్షన్, తెల్ల రేషన్ కార్డు ఉన్నప్పటికీ ఆధార్ ఇవ్వకపోవడంతో కొందరు ఉచిత గ్యాస్‌కు అర్హత పొందలేక పోయారు. వీరు ఆధార్ అనుసంధానం చేసుకుంటే పథకానికి అర్హులవుతారు. కుటుంబ సభ్యుల్లో ఎవరి పేరిట గ్యాస్ కనెక్షన్ ఉందో ఆ వ్యక్తి పేరు రేషన్ కార్డులో ఉంటే పథకానికి సంబంధించిన రాయితీ వర్తిస్తుంది. భార్య పేరుతో రేషన్ కార్డు, భర్త పేరుతో గ్యాస్ కనెక్షన్ ఉన్నా అర్హులవుతారని ప్రభుత్వం స్పష్టత ఇచ్చింది. ఇంకా ఎవరికైనా అనుమానాలుంటే 1967 టోల్ ఫ్రీ నెంబరుకు ఫోను చేసి తెలుసుకోవచ్చని అధికారులు తెలిపారు.

రుయాలో 'ఓపీ'కకు పరీక్ష

- గంటల తరబడి క్యూలో నిరీక్షిస్తున్న రోగులు



ఓపీ కోసం నిరీక్షిస్తున్న మహిళలు



చిన్నారికి పెట్టిన సెలైన్‌తో ఓపీలో తిరుగుతున్న సహాయకులు

తిరుపతి(వైద్యం), నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): వైద్యం కోసం సుదూర ప్రాంతాల నుంచి రుయాస్పత్రికి వచ్చే రోగుల 'ఓపీ'కకు పరీక్ష పెడుతున్నారు. 'ఈ- వైద్యం' పేరిట ఓపీ నిబంధనలను మార్చడంతో తిప్పలు పడుతున్నారు. గతంలో ఆధార్.. ఫోను నంబరు, చిరునామా చెబితే ఓపీ ఇచ్చేవారు. రోగుల సహాయకులు క్యూలో నిలబడి ఓపీ తీసుకునేవారు. ఇటీవల ఈ-వైద్యం పేరుతో ఓపీ ఇచ్చే నిబంధనలను అధికారులు మార్చారు. ఆ ప్రకారం.. ఓపీ తీసుకోవాలంటే నేరుగా రోగులే వచ్చి ఓపీ కేంద్రంలో వేలిముద్ర వేయాలి. ఆధార్‌కు అనుసంధానమైన ఫోన్ నంబరుతో మాత్రమే ఓటీపీ విధానంతో ఓపీ తీసుకోవాలి. అసలే జబ్బు చేసి బాధపడే రోగులు ఓపీ కోసం క్యూలో నిలుచుకోలేక ఇబ్బంది పడుతున్నారు. ఎక్కువగా గ్రామీణ ప్రాంతాల నుంచే రోగులు రుయాస్పత్రికి వస్తుంటారు. అటువంటి వారి ఆధార్‌కు ఫోన్ నంబరు అనుసంధానం ఉండదు. ఈ క్రమంలో వారు ఓపీ అందక వెనుదిరగాల్సిన పరిస్థితి నెలకొంటోంది. మూడు రోజులుగా ఈ విధానం వలన ఓపీ కేంద్రం రోగులు, వారి సహాయకులతో కిటకిటలాడుతోంది. ఉదయం 8.30 నుంచి మధ్యాహ్నం 12.30 వరకే ఓపీ సమయం ఉంటుంది. సాధారణ రోజుల్లో ఓపీ కోసం వెయ్యి నుంచి 1,200 మందికి పైగా వస్తుంటారు. సోమ, బుధవారాల్లో ఈ సంఖ్య 1,500 పైగా ఉంటుంది. కొత్త విధానం అమల్లోకి రావడంతో మూడు రోజులుగా 800 మందికి కూడా ఓపీ అందడం లేదు. రోగి పూర్తి వివరాలు నమోదు చేయడంతోపాటు వారి వేలిముద్ర కూడా తీసుకోవాల్సి ఉండటంతో ఒక్కో రోగికి ఓపీ ఇచ్చేందుకు పది నిముషాల సమయం పడుతోంది. సమయం లేక అనేక మంది ఓపీ అందకనే వెనుదిరగాల్సిన పరిస్థితి నెలకొంటోంది. నడవలేని, వృద్ధులు, వికలాంగులు ఓపీ క్యూలో ఇబ్బందులు పడుతున్నారు. రుయా అధికారులు దీనిపై దృష్టి సారించి, రోగులకు ఎలాంటి ఇబ్బందులూ లేకుండా ఓపీ సేవలు అందించాలని పలువురు కోరుతున్నారు.

నాడు శ్రీగంధం కేసులో సస్పెన్షన్

- నేడు ఎర్రచందనం కేసులో అరెస్టు
- ఎర్రావారిపాళెం కానిస్టేబుల్ నిర్వాకం



గుర్రప్ప

తిరుపతి(నేరవిభాగం), నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): రెండు నెలల కిందట శ్రీగంధం కేసులో సస్పెండైన కానిస్టేబుల్ గుర్రప్ప.. బుధవారం ఎర్రచందనం కేసులో అరెస్టయ్యారు. ఎర్రావారిపాళెం పోలీసు స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న ఇతడిపై అనేక ఆరోపణలున్నాయి. గతంలో శ్రీగంధం అక్రమ రవాణా కేసులో కొంతమంది నిందితులను, ఆటో డ్రైవర్ సుబ్రహ్మణ్యం రెడ్డిని బెదిరించి మామూళ్లు తీసుకున్నట్లు ఫిర్యాదులు వచ్చాయి. ఈ ఘటనలో రెండు నెలల కిందట కానిస్టేబుల్ గుర్రప్పను సస్పెండు చేశారు. దీనిపై లోతైన దర్యాప్తు చేయాలని ఎస్పీ సుబ్బరాయుడు ఆదేశించారు. ఈ క్రమంలో స్పెషల్ బ్రాంచ్ పోలీసులు సమగ్ర విచారణ చేపట్టగా.. ఎర్రచందనం అక్రమ రవాణా కేసులోనూ గుర్రప్పకు ప్రమేయం ఉన్నట్లు తేలింది. ఎర్రచందనం స్మగ్లింగ్‌కు పాల్పడుతున్న ఏ4 ముద్దాయితో నేరుగా సంబంధాలు ఉన్నట్లు దర్యాప్తులో నిర్ధారణ అయింది. ఎస్పీ ఆదేశాల మేరకు బుధవారం ఎర్రచందనం టాస్క్‌ఫోర్సు పోలీసులు అతడిపై కేసు నమోదు చేసి అరెస్టు చేశారు. రిమాండుకు తరలించారు. దీనిపై సమగ్రంగా విచారణ జరిపి నివేదిక ఇవ్వాలని ఎస్పీ ఆదేశించారు.

టీటీడీ సభ్యుల ప్రమాణ స్వీకారం

తిరుమల శ్రీవారి ఆలయంలో బుధవారం టీటీడీ చైర్మన్‌తో పాటు మరో 15 మంది సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. ప్రమాణం చేసిన సభ్యులు..


బి.మహేంద్రరెడ్డి


అనుగోలు రంగశ్రీ


తమ్మిశెట్టి జానకీదేవి


వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి


అదిత్ దేశాయ్


బి.ఆనంద్‌సాయి


జంగా కృష్ణమూర్తి


జాస్తి పూర్ణసాంబశివరావు


ఎం.శాంతారాం



మల్లెల రాజశేఖర్‌గౌడ్


ఎంఎస్ రాజు


నన్నూరి నర్సిరెడ్డి


ఆర్ఎన్ దర్శన్


నరేష్‌కుమార్


పి.రామమూర్తి

● పద్మావతి, ఎస్వీయూల్లో సేంద్రియ వ్యవసాయం చేస్తున్న పీజీ విద్యార్థులు

విద్యార్థుల సేద్యం


ఎస్వీయూ గ్రీన్‌టీం




పద్మావతి వర్సిటీ గ్రీన్‌టీం





పుస్తకం పట్టిన చేతులే పారా పలుగూ అందుకుంటున్నాయి. ల్యాబరేటరీల్లో పరిశోధనలు చేసే విద్యార్థులు, మట్టిలో విత్తనాలు నాటి, కలుపు తీసి, కూరగాయలు పండించి వినూత్న ప్రయోగాలు చేస్తున్నారు. తిరుపతిలోని పద్మావతి మహిళా యూనివర్శిటీ, శ్రీవేంకటేశ్వర యూనివర్శిటీల విద్యార్థులు సేంద్రియ వ్యవసాయానికి శ్రీకారం చుట్టారు. యూనివర్శిటీల ప్రాంగణంలోనే పాలేకర్ స్ఫూర్తిగా కూరగాయలు సాగు చేస్తున్నారు. వర్డ్ సంస్థ వ్యవస్థాపకుడు గంగాధరం నేతృత్వంలో విద్యార్థులు గ్రీన్‌టీం లుగా ఏర్పడి ప్రకృతి వ్యవసాయ క్షేత్రాల్లో పనుల్లో సందడి చేస్తున్నారు.

ప్రత్యేక కథనం - తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఆంధ్రజ్యోతి

20 అడుగుల నేల వారి ప్రయోగ క్షేత్రం

ప్రకృతి వ్యవసాయ ప్రయోగశాలకు ఈ రెండు యూనివర్శిటీల విద్యార్థులు కేటాయించుకున్న నేల.. కేవలం 20 చదరపు అడుగులు మాత్రమే. ఒక కుటుంబం ఏడాది పొడవునా ఆరోగ్యకరమైన కూరగాయలు పండించుకోవడానికి ఈ తావు చాలు అంటారు గంగాధరం. పద్మావతిలో 20 మంది విద్యార్థినులు, ఎస్వీయూలో 20 మంది రెండు గ్రీన్ టీంలుగా ఏర్పడ్డారు. తమ ప్రాంగణాల్లో ప్రయోగ క్షేత్రాన్ని సిద్ధం చేసుకున్నారు. మడులుగా మలచుకుని విత్తనాలు నాటారు. ఇప్పుడవి కాపుకొచ్చాయి. తమ చేతులతో నాటి నీళ్ల పోసి పెంచిన మొక్కలు కాసిన నవనవలాడే కూరగాయలను చూసి వారు మురిసిపోతున్నారు.

సొంతంగా ఎరువులు


విద్యార్థులకు మొక్కల పోషణ గురించి వివరిస్తున్న గంగాధరం

పూర్తిగా సేంద్రియ పద్ధతిలో చేస్తున్న సేద్యం ఇది. దేశీయ విత్తనాలే నాటుతున్నారు. వంగ, బెండ, సొర, బీర, మిరప, టమోటా,మొక్క జొన్న, బీన్స్ వంటి కాయగూరలు ఈ క్షేత్రాల్లో ఉన్నాయి. తోటకూర, సిరికూర, పాలకూర, చుక్కకూర, గోంగూర వంటి ఆకుకూరలున్నాయి. సస్యరక్షణలో భాగంగా బంతి పూల మొక్కలు నాటారు.అంతర పంటగా మొక్కజొన్న నాటారు. చిక్కుడు, సొర, బీర వంటి తీగజాతి మొక్కలు ఒక పక్కగా నాటారు. రసాయన ఎరువులు వాడడం లేదు. జీవామృతం, వేప కషాయం, ఆవు పేడ, మూత్రం, శనగ పిండి, పుట్టమట్టితో తామే ఎరువులు తయారు చేసుకుని ఈ పంటలకు అందిస్తున్నారు.

ఈ అనుభూతి అద్భుతం

రసాయనాల అవశేషాలు లేని ఆహారం తింటే ఆరోగ్యంగా ఉంటాం. సేంద్రియ పద్ధతిలో మేం పండిస్తున్న కూరగాయలు, ఆకుకూరలు ఆరోగ్యకరమైనవి. సహజ ఎరువులే వాడుతున్నాం. మా యూనివర్శిటీలో మా చేతులతో కూరగాయలు పండిస్తున్న అనుభూతి అద్భుతంగా ఉంది.

- డి. ప్రియాంక, ఎమ్మెస్సీ జువాలజీ సెకండియర్, పద్మావతి వర్సిటీ

ప్రకృతి సేద్యంపై పరిశోధన

పీజీ తర్వాత సహజ సిద్ధంగా లభించే ఆహార పదార్థాల్లోని పోషక విలువలపై పరిశోధన చేయాలనే ఆలోచనతో ఉన్నా. మా యూనివర్శిటీలోని ఈ ప్రయోగ క్షేత్రంలో పనిచేయడం ప్రాథమిక పరిశోధనలా ఉంది. చాలా సంతోషంగా ఉంది.

-ఎం. పల్లవి, ఎమ్మెస్సీ హోం సైన్స్ ఫుడ్ టెక్నాలజీ సెకండియర్, పద్మావతి వర్సిటీ

చీడపీడలపై యుద్ధం

వ్యవసాయంలో చీడపీడలను ఎదుర్కొవడం పెద్ద సవాలు. రసాయన మందులు చల్లి సులువుగా వీటిని నివారిస్తున్నారు. అయితే వీటి అవశేషాలు మిగిలిపోయి మనం ఆహారంగా తీసుకున్నప్పుడు అనేక రోగాలకు కారణంగా మారుతున్నాయి. ఇందుకు విరుగుడుగా ఈ రెండు యూనివర్శిటీల్లో సేంద్రియ పద్ధతిలోనే చీడపీడలపై యుద్ధం చేస్తున్నారు. ముందుగా బీజామృతంతో విత్తనశుద్ధి చేసుకుని నేలలో నాటుతారు. ప్రతి 15 రోజులకోసారి జీవామృతం నీటిలో కలిపి మొక్కలకు పారిస్తారు. ఇది మంచి పోషకాలను ఇస్తుంది. మట్టిలో ఘనజీవామృతం చల్లడం ద్వారా వానపాములు, జీవరాశులు వ్యాప్తి చెంది పంట భూమి సారవంతమవుతుంది. చీడపీడలు ఆశించకుండా వేపాకు, గోమూత్రం, ఆవుపేడతో చేసిన నీమాస్త్రం పిచికారీ చేస్తున్నారు. పురుగు ఆశిస్తే.. వేప, ఉమ్మెత్త, సీతాఫలం, పల్లేరు ఆకుల జిగురును ఆవు మూత్రంలో ఉడికించి తయారుచేసుకున్న బ్రహ్మాస్త్రం పిచికారీ చేస్తారు. ఎంతకీ లొంగని చీడను అగ్నాస్త్రంతో ఎదుర్కొంటున్నారు. మిరపకాయలు, వెల్లుల్లి, పొగాకు, ఆవుమూత్రంతో దీనిని తయారు చేసుకుంటున్నారు. ఆకుముడత పురుగు, కాండం తొలుచు పురుగు, కాయ తొలుచు పురుగు, వేరు పురుగు నివారణకు దీనిని వాడుతున్నారు.

ఒత్తిళ్లన్నీ మరచిపోతున్నాం

మేం చదువుకునే చోటే ఆకుకూరలు, కూరగాయలు, పూలు పండిస్తున్నాం. చదువుకుంటూనే, స్నేహితులతో కలిసి యూనివర్సిటీలోనే వ్యవసాయ పనులు చేస్తూ ఉండటం చెప్పలేని ఆనందాన్ని ఇస్తూ ఉంది. చదువుల్లో ఉన్న ఒత్తిడినంతా పచ్చని ప్రకృతి వ్యవసాయ క్షేత్రాన్ని చూసిన వెంటనే మాయమై పోతూ ఉంది.

- ఖలీద్, ఎమ్మెల్సీ బోటనీ సెకండియర్, ఎస్వీయూ


మా పల్లె రైతులనూ మారుస్తా

క్లాసుల్లేని సమయంలో ఇలా సేద్యం పనులు చేయడం చాలా బావుంది. ప్రతి శుక్ర, శని వారాల్లో గ్రీన్ టీం ఆధ్వర్యంలో కలుపు తీయడం, నీళ్ళు కట్టడం చేస్తున్నాం. ఈ అనుభవంతో మా ఊరిలోనూ రైతులను ప్రకృతి వ్యవసాయం వైపు నడిపించాలని అనిపిస్తుంది.

- రూపేష్ కుమార్, ఎమ్మెస్సీ బోటనీ సెకండియర్, ఎస్వీయూ







అఖిలాండం వద్ద కర్పూరం వెలిగిస్తున్న సాయిధరమ్ తేజ్ - క్యూలో సప్తగిరి - ఆలయం ముందు స్నేహారెడ్డి

శ్రీవారి సేవలో సినీ ప్రముఖులు

తిరుమల, నవంబరు6(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని బుధవారం పలువురు సినీ ప్రముఖులు దర్శించుకున్నారు. సుప్రభాత సేవలో హీరో సాయిధరమ్ తేజ్, అల్లు అర్జున్ సతీమణి స్నేహారెడ్డి పాల్గొన్నారు. సుప్రభాత పఠనం అనంతరం శ్రీవారిని దర్శించుకున్నారు. ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో నటులు సప్తగిరి, రఘు, దగ్గుబాటి అభిరామ్, దర్శకుడు అట్లూరి వెంకటేశ్వరరావు, నిర్మాత సంతోష్ కూడా స్వామిని దర్శించుకున్నారు. ఈమేరకు వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి లడ్డూప్రసాదాలు అందజేశారు.

ఇద్దరు డిగ్రీ విద్యార్థులపై హత్యాయత్నం

● ఒకరి పరిస్థితి విషమం

శ్రీకాళహస్తి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఇద్దరు డిగ్రీ విద్యార్థులపై గుర్తు తెలియని వ్యక్తి హత్యాయత్నానికి పాల్పడ్డారు. ఈ ఘటన శ్రీకాళహస్తి పట్టణ శివార్లలోని చెన్నై రోడ్డు సమీపంలో ఉన్న ఈదులగుంట వద్ద కలకలం రేపింది. బుచ్చినాయుడుకండ్రిగ మండలం నెలవాయి గ్రామానికి చెందిన విష్ణువర్ధన్, శ్రీకాళహస్తి పట్టణం తెట్టు ప్రాంతానికి చెందిన వాసు ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాలలో మొదటి సంవత్సరం చదువుతున్నారు. ఇద్దరూ సాయంత్రం చెన్నై రోడ్డులోని సాయిబాబా ఆలయం సమీపంలో నిలబడి ఉండగా గుర్తు తెలియని వ్యక్తి కత్తితో వారిపై విరుచుకుపడ్డాడు. దీంతో విష్ణువర్ధన్ తీవ్రంగా, వాసు స్వల్పంగా గాయపడ్డారు. అటుగా వెళుతున్న కొందరు గమనించి యువకులను ఆటోలో శ్రీకాళహస్తి పట్టణంలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడ విష్ణువర్ధన్‌కు ప్రాథమిక చికిత్స చేశారు. అనంతరం పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం తిరుపతి రుయాకు రెఫర్ చేశారు. స్వల్ప గాయాలతో బయటపడ్డ వాసు స్థానిక ప్రైవేటు వైద్యశాలకు చికిత్స నిమిత్తం వెళ్లాడు. కాగా సాయిబాబా ఆలయం వద్ద కత్తితో దాడికి పాల్పడిన సమయంలో స్థానికులు హడలిపోయారు. అలాగే ప్రభుత్వ ఆసుపత్రి అత్యవసర విభాగం వద్ద రక్తపు మరకలను చూసి రోగులు, వారి బంధువులు ఉలిక్కిపడ్డారు. ఈ ఘటనపై టూ టౌన్ సీఐ వెంకటేశ్వర్లును వివరణ కోరగా... తాము ఆస్పత్రికి చేరుకునేలోగా క్షతగాత్రులు చికిత్స నిమిత్తం వెళ్లిపోయారన్నారు. విచారణ చేస్తున్నామని తెలిపారు.


చికిత్స పొందుతున్న విష్ణువర్ధన్



ఈ స్థలంలోకి ప్రవేశిస్తే..!

● శిక్షార్హులంటూ జగనన్న లే అవుట్‌లో హెచ్చరిక బోర్డు

రేణిగుంట, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): 'ఈ స్థలం కోర్టులో ఉన్నది. ఇందులో ప్రవేశించే వారు శిక్షకు అర్హులు' అంటూ జగనన్న లే అవుట్‌లో హెచ్చరిక బోర్డు వెలిసింది. ఇది లబ్ధిదారులను ఆందోళనకు గురిచేస్తోంది. రేణిగుంట మండలం జీపాళెం పంచాయతీ కుర్రకాలువ సమీపంలోని పద్మానగర్‌లో వైసీపీ ప్రభుత్వంలో జగనన్న లే అవుట్‌ను ఏర్పాటు చేసి పలువురికి ఇంటి స్థలాలను కేటాయించారు. ఇళ్ల స్థలాలకు పోను ఉద్యానవనం కోసం ఎకరా వదిలిపెట్టారు. ప్రస్తుతం పలువురు ఇళ్లు నిర్మించుకున్నారు. ఈ నేపథ్యంలో కోర్టు వివాదమంటూ బుధవారం హెచ్చరిక బోర్డు పెట్టడంతో లబ్ధిదారులు ఆందోళనకు గురయ్యారు. ఈ బోర్డులో ఉన్న నెంబరుకు ఫోను చేయగా కొత్తపాళేనికి చెందిన సుబ్రమణ్యంగా తెలిసింది. 'నలభై ఏళ్ల క్రితం ఇందిరాగాంధీ హయాంలో రైతులకు వ్యవసాయ భూములను పంపిణీ చేసి పట్టాలిచ్చారు. ఇందులో మా తల్లి నాగభూషణం పేరిట భూమి ఉంది. ఇక్కడ వైసీపీ ప్రభుత్వం జగనన్న లే అవుట్ ఏర్పాటుకు భూసేకరణ చేసి ఎకరాకు రూ.32లక్షల పరిహారం ఇచ్చింది. మా భూమికి ఎటువంటి పరిహారం ఇవ్వకుండా రెండేళ్లుగా తహసీల్దారు కార్యాలయం చుట్టూ తిప్పించుకున్నారు. దీంతో కోర్టును ఆశ్రయించాను' అని సుబ్రహ్మణ్యం తెలిపారు. ఈ విషయమై తహసీల్దారు శ్యామ్‌ప్రసాద్‌ను వివరణ కోరగా.. హెచ్చరిక బోర్డు విషయం తన దృష్టికి వచ్చిందన్నారు. వీఆర్వోతో విచారణ జరిపించినట్లు తెలిపారు. కోర్టు ఉత్తర్వులుంటే తమకు చూపించాలని లేనిపక్షంలో ఆ బోర్డును తొలగిస్తామని స్పష్టం చేశారు.

డీఎస్సీ ఉచిత కోచింగ్‌కు ప్రవేశ పరీక్షను పక్కాగా నిర్వహించండి

తిరుపతి(కలెక్టరేట్), నవంబరు 6: ఉచిత మెగా డీఎస్సీ కోచింగ్‌కు ప్రవేశ పరీక్షను పకడ్బందీగా నిర్వహించాలని అధికారులను కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశించారు. ఈ ప్రవేశ పరీక్ష నిర్వహణపై బుధవారం సాయంత్రం కలెక్టరేట్‌లో ఆయన సమీక్షించారు. జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు సాంఘిక సంక్షేమ, గిరిజనశాఖ ఆధ్వర్యంలో నిర్వహించే ఉచిత శిక్షణకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఈనెల 10వ తేది ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నట్లు చెప్పారు. తిరుపతిలోని చదలవాడ రమణమ్మ ఇంజనీరింగ్ కళాశాల, కరకంబాడి రోడ్డులోని శ్రీరామ ఇంజనీరింగ్ కళాశాల, పుత్తూరు సమీపంలోని సిద్ధార్థ ఇంజనీరింగ్ కళాశాలలో ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు పరీక్ష నిర్వహిస్తున్నట్లు వివరించారు. అభ్యర్థులు తమ హాల్‌టిక్కెట్లను 'జ్ఞానభూమి' పోర్టల్‌లో డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. ఇతర వివరాలకు ప్రత్యేక హెల్ప్ లైన్ నెంబరు 70130 08498ను సంప్రదించాలని తెలిపారు. పరీక్షా కేంద్రాల్లో అవసరమైన మౌలిక సదుపాయాలను అధికారులు కల్పించాలని ఆదేశించారు. ఉచిత శిక్షణ కోసం జిల్లా నుంచి 539 దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అధికారులు చెన్నయ్య, సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

టూరిజం డీవీఎంగా శ్రీనివాసరావు


నూతన డీవీఎంను పరిచయం చేసుకుంటున్న టూరిజం ఉద్యోగులు

తిరుపతి అర్బన్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ పర్యాటకాభివృద్ధి సంస్థ జిల్లా డివిజనల్ మేనేజర్‌గా సీహెచ్ శ్రీనివాసరావు నియమితులయ్యారు. ఇప్పటి వరకు ఉన్న గిరిధర్‌రెడ్డిని మాతృసంస్థ(ఆర్టీసీ)కు బదిలీ చేశారు. నెల్లూరు డీవీఎంగా ఉన్న శ్రీనివాసరావును తిరుపతికి బదిలీ చేశారు. బుధవారం ఉదయం జూపార్కు రోడ్డులోని కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. కార్యాలయ ఉద్యోగులు, సిబ్బంది ఆయన్ను మర్యాదపూర్వకంగా కలసి పరిచయం చేసుకున్నారు. ఆయన మాట్లాడుతూ సమన్వయంతో పని చేసి సంస్థ ఆదాయానికి, అభివృద్ధికి ప్రాధాన్యత ఇద్దామని కోరారు.

సదరన్ డిస్కం బోర్డు లీగల్ కౌన్సిల్‌గా మధుసూదన రెడ్డి



తిరుపతి(ఆటోనగర్)నవంబరు6(ఆంధ్రజ్యోతి): ఏపీఎస్పీడీసీఎల్ ఆపరేషన్ సర్కిల్ తిరుపతి బోర్డు లీగల్ కౌన్సిల్‌గా ఎస్.మధుసూదన రెడ్డిని నియమిస్తూ బుధవారం డిస్కం సీఎండీ కె.సంతోషరావు ఉత్తర్వులు జారీ చేశారు. మధుసూదన్ రెడ్డి తిరుపతి ఆపరేషన్ టౌన్ డివిజన్‌లో బోర్డు లీగల్ కౌన్సిల్‌గా విధులు నిర్వహిస్తారు. 2027 అక్టోబరు 31 వరకు ఆయన మూడేళ్ల పాటు విధులు నిర్వహిస్తారు.


దక్షిణామూర్తి సన్నిధిలో హుండీ లెక్కింపు

ముక్కంటి ఆలయ హుండీ లెక్కింపు

● 40 రోజుల్లో రూ.1.94 కోట్ల ఆదాయం

శ్రీకాళహస్తి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : శ్రీకాళహస్తీశ్వరాలయంలోని గురు దక్షిణామూర్తి సన్నిధిలో బుధవారం హుండీ లెక్కింపు జరిగింది. రూ. 1,94,41,581 నగదు హుండీ ద్వారా వచ్చింది. ఇక బంగారం 85.100 గ్రాములు, వెండి 607.10 కిలోలు, ఇతర దేశాలకు చెందిన 145 నోట్లు విదేశీ నగదు వచ్చింది. సెప్టెంబరు 25వ తేదీన చివరిగా హుండీ లెక్కింపు జరిగింది. 40 రోజుల తర్వాత బుధవారం జరిగిన లెక్కింపులో వచ్చిన ఆదాయం 1.94 కోట్లుగా అధికారులు ప్రకటించారు.

నేడు రెండు సబ్ స్టేషన్లకు శంకుస్థాపన

● వర్చువల్‌గా భూమిపూజ చేయనున్న సీఎం చంద్రబాబు

తడ, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో రెండు 132 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ల నిర్మాణానికి గురువారం ముఖ్యమంత్రి నారాచంద్రబాబునాయుడు వర్చువల్‌గా భూమిపూజ నిర్వహించనున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 14 సబ్ స్టేషన్ల నిర్మాణ శంకుస్థాపనలో భాగంగా తడ మండలం మాంబట్టు, రేణిగుంట మండలం తూకివాకంలో రెండు సబ్‌స్టేషన్ల నిర్మాణాలకు భూమిపూజ జరగనుంది. ఇందులో మాంబట్టు సబ్ స్టేషన్‌కు రూ.43.50 కోట్లు, తూకివాకం సబ్‌స్టేషన్‌కు రూ.76.89 కోట్లను ప్రభుత్వం కేటాయించింది. ఈ మేరకు గురువారం సూళ్లూరుపేట మండలం మన్నారుపోలూరు 220 కేవీ సబ్ స్టేషన్ పరిధిలో శంకుస్థాపనకు ఏర్పాట్లు చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు వర్చువల్‌గా మంగళగిరిలో శంకుస్థాపన చేసిన అనంతరం ఇక్కడ జిల్లా జాయింట్ కలెక్టర్ శుభంబన్సాల్, సూళ్లూరుపేట ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ చేతుల మీదుగా భూమిపూజకు ఏర్పాట్లు చేశామని ట్రాన్స్‌కో డీఈ బలరామమూర్తి తెలిపారు.

గూడూరు
సూళ్లూరుపేట/వెంకటగిరి

సమస్యల పరిష్కారం కోసమే గ్రామసభలు



మన్నెమాల గ్రామసభలో మాట్లాడుతున్న అరుణ్‌కుమార్

చిట్టమూరు, నవంబర్ 6 (ఆంధ్రజ్యోతి): రీ సర్వేలో ఉత్పన్నమైన సమస్యలను పరిష్కరించేందుకే గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు జిల్లా సర్వే భూమి రికార్డుల శాఖాధికారి అరుణ్‌కుమార్ తెలిపారు. బుధవారం మండలంలోని మన్నెమాల గ్రామంలో జరిగిన గ్రామసభలో ఆయన మాట్లాడారు. రీ సర్వేలో పరిష్కారం కాని సమస్యలపై అర్జీలు ఇవ్వాలని రైతులకు సూచించారు. పట్టాదారు పేర్ల చేర్పులు, మార్పులు, విస్తీర్ణంలో తగ్గుదల, వన్ బీలు రానివారు గ్రామసభల్లో అర్జీలు ఇచ్చిన 15 రోజుల లోపు సమస్యలను పరిష్కరిస్తారని అన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు ప్రసాద్, ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వే రాంప్రసాద్, ప్రసాద్, డీఐవోఎస్ సుబ్బరాయుడు, రీసర్వే డిప్యూటీ తహసీల్దారు నిరంజన్‌కుమార్, మండల సర్వేయర్ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

నైపుణ్య గణన పక్కాగా నిర్వహించాలి

డక్కిలి, నవంబరు 6: స్కిల్ డెవలప్‌మెంట్ సర్వేలో నైపుణ్య గణనను పక్కాగా నిర్వహించాలని ఎంపీడీవో గుణశేఖరరెడ్డి అన్నారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో స్కిల్ డెవలప్‌మెంట్ సర్వేపై సచివాలయ ఉద్యోగులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సచివాలయ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి 15 నుంచి 59 సంవత్సరాల వయసున్న వారి నైపుణ్యాన్ని సర్వే చేసి యాప్‌లో నమోదు చేయాలన్నారు. ఇందువల్ల నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు ఉంటాయని చెప్పారు. కార్యక్రమంలో స్కిల్ డెవలప్‌మెంట్ రీసోర్సు పర్సన్ ఈతముక్కల గురవయ్య, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వరి పంటపై గడ్డిమందు పిచికారి
బాధితురాలి ఫిర్యాదుతో కేసు నమోదు

దొరవారిసత్రం, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): దొరవారిసత్రం మండలం బూదూరు గ్రామానికి చెందిన పట్టు వరలక్ష్మి, చేరెడ్డి జగన్నాథ రెడ్డి మధ్య కొంతకాలంగా భూ వివాదం నడుస్తోంది. ఈ క్రమంలో వరలక్ష్మి వేసిన ఎల్లి వరిపంటపై జగన్నాథరెడ్డి రెండురోజుల క్రితం గడ్డిమందు పిచికారి చేయించాడు. దాంతో పంట ఎండిపోయింది. బాధితురాలు వరలక్ష్మి ఫిర్యాదు మేరకు జగన్నాథ రెడ్డిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ అజేయ్‌కుమార్ తెలిపారు.

రాష్ట్రస్థాయి హాకీ పోటీలకు విందూరు విద్యార్థులు



హాకీ క్రీడాకారులతో హెచ్‌ఎం మల్లికార్జున్‌రావు, సిబ్బంది

గూడూరు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి అండర్-14 హాకీ పోటీలకు విందూరు ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు హెచ్‌ఎం మల్లికార్జున్‌రావు తెలిపారు. బుధవారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల నెల్లూరులో నిర్వహించిన ఎస్‌జీఎఫ్ జిల్లాస్థాయి అండర్-17 హాకీ పోటీల్లో తమ పాఠశాలకు చెందిన విద్యార్థినులు జగదీశ్వరి, యశ్వంతి, సుమయా, యామిని, వెంకటజనని, బాలుర విభాగంలో గురుసంతోష్ జిల్లా జట్టుకు ఎంపికై రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించారన్నారు. ఈనెల 8నుంచి 10వ తేదీ వరకు అనకాపల్లి జిల్లాలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో వీరు పాల్గొంటారని తెలిపారు. వీరికి శిక్షణ ఇచ్చిన పీడీ కరిముల్లాఖాన్‌ను అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు జోసఫ్, బాలాజీ, బాలమురళి, పుల్లంరాజు, అనిల్, దయాకర్ తదితరులు పాల్గొన్నారు.

షటిల్ పోటీల్లో యశ్విన్ ప్రతిభ



యశ్విన్‌తో పాఠశాల సిబ్బంది

గూడూరు అర్బన్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): షటిల్ బ్యాడ్మింటన్ పోటీల్లో గాయత్రి పాఠశాల విద్యార్థి యశ్విన్ ప్రతిభ చాటినట్లు కరస్పాండెంట్ శివ కుమార్ రెడ్డి తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ ఇటీవల చెన్నైలో నిర్వహించిన తమిళ నాడు ఓపెన్ ప్రభాకరన్ షటిల్ బ్యాడ్మింటన్ పోటీల్లో అండర్-9,11 విభాగాల్లో యశ్విన్ ప్రథమ స్థానం సాధించా డన్నారు. కార్యక్రమంలో చైతన్య, మస్తాన్‌బీ, రఫి, హరిత, సుప్రియ, సమీన్ పాల్గొన్నారు.

నేడు నెల్లూరు మెమో రైళ్లు రద్దు

తడ, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట నుంచి నెల్లూరుకు వెళ్లే మెమో రైళ్లను గురువారం సదరన్ రైల్వే అధికారులు రద్దు చేశారు. సూళ్లూరుపేట సమీపంలోని కాళంగినదిపై పనుల జరుగుతున్న కారణంగా నెల్లూరు వైపు వెళ్లే డౌన్‌లైన్‌లో బుధవారం అర్ధరాత్రి 12 గంటల నుంచి గురువారం ఉదయం 8 గంటల వరకు రైళ్ల రాకపోకలను నిలిపివేయనున్నారు. ఉదయం 7.55 నిమిషాలకు సూళ్లూరుపేట నుంచి నెల్లూరు వైపు వెళ్లే మెమో రైలు, ఉదయం 10.20 నిమిషాలకు నెల్లూరు నుంచి సూళ్లూరుపేటకు వచ్చే మెమో రైలును పూర్తిగా రద్దు చేశారు. అలాగే చెన్నై - సూళ్లూరుపేట మధ్య నడిచే పలు లోకల్ రైళ్లు రద్దుకాగా, మరికొన్ని లోకల్ రైళ్లను ఎలావూరు, సూళ్లూరుపేట మధ్య రద్దుచేశారు. గురువారంతో పాటు ఈ నెల 9వ తేదీ శనివారం, 12వ తేదీ మంగళవారం సైతం ఈ రైళ్లు రద్దు కానున్నాయని సదరన్ రైల్వే అధికారులు ఓ ప్రకటనలో తెలిపారు.

రియల్టర్‌పై అట్రాసిటీ కేసు

దొరవారిసత్రం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): దొరవారిసత్రం మండలం కమ్మకండ్రిగ గ్రామానికి చెందిన రియల్టర్ గుత్తా రవీంద్రనాయుడుపై అట్రాసిటీ కేసు నమోదైంది. పోలీసుల కథనం మేరకు... మండలంలోని బూదూరు గ్రామానికి చెందిన వరలక్ష్మి భూమికి కాపలాదారుగా ఉన్న తనను రవీంద్రనాయుడు కులం పేరుతో దూషించారని అదే గ్రామానికి నెలబల్లి చంద్రయ్య పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు రవీంద్రనాయుడుపై బుధవారం అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ అజేయ్‌కుమార్ తెలిపారు.

రక్తదాన శిబిరం

గూడూరు అర్బన్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): స్థానిక శ్రీచైతన్య పాఠశాలలో బుధవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ప్రిన్సిపాల్ శ్రీనివాసులు మాట్లాడుతూ రక్తదానం ప్రాణదానంతో సమానమన్నారు. రక్తదానం చేయడం సామాజిక బాధ్యతగా గుర్తించాలన్నారు. కార్యక్రమంలో శ్రీహరిబాబు, అజయ్, గాంధీ, హరిబ్రహ్మా, చందన, కిరణ్మయి తదితరులు పాల్గొన్నారు.



పెసలగుర్రప్ప తోట వద్ద అండర్‌పాస్ లేకపోవడంతో జాతీయ రహదారి దాటుతున్న స్కూల్‌వ్యాన్లు, ప్రయాణికులు

పల్లెకు పోయే దారేదీ..?
హైవే నిర్మాణంతో కనుమరుగవుతున్న లింకు రోడ్లు
సర్వీస్ రోడ్లు లేక రాకపోకలకు ఇక్కట్లు

పెళ్లకూరు నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట నుంచి రేణిగుంట వరకు నిర్మాణంలో ఉన్న ఆరు వరుసల జాతీయ రహదారితో పెళ్లకూరు మండలంలోని గ్రామీణ ప్రాంతాలకు దారి సౌకర్యం కనుమరుగవుతోంది. వివిధ గ్రామాలకు చెందిన ప్రజలు నాయుడుపేట, శ్రీకాళహస్తి, తిరుపతి పట్టణాలకు రాకపోకలు సాగించడానికి తీవ్ర ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. గతంలో ఆయా ప్రాంతాలకు వెళ్లేందుకు నాయుడుపేట - తిరుపతి రహదారిని కలుపుతూ లింకు రోడ్లు ఉండేవి. ప్రస్తుతం జాతీయ రహదారి నిర్మాణంలో సర్వీస్ రోడ్లు పూర్తి స్థాయిలో నిర్మించకపోవడంతో గ్రామాల్లోకి వెళ్లేందుకు ప్రజలు ఇక్కట్లు పడుతున్నారు. జాతీయ రహదారికి ఇరువైపులా ఉన్న గ్రామాల్లోకి వెళ్లాలంటే కిలోమీటర్ల కొద్దీ ప్రయాణించాల్సిన పరిస్థితి నెలకొంది. తాళ్వాయిపాడు, చావాలి, చిల్లకూరు, పెళ్లకూరు, టెంకాయతోపు, నెలబల్లి గ్రామాల వద్ద అండర్ పాస్‌లకు ఇరువైపులా సర్వీస్ రోడ్ల నిర్మాణంలోనూ తీవ్ర జాప్యం జరుగుతోంది. మండలంలో సుమారు 18 కిలోమీటర్ల మేర జాతీయ రహదారి ఇరువైపులా విస్తరించి ఉన్న 14 గ్రామాల రూపురేఖలు మారిపోయాయి. దీంతో పలు గ్రామాల్లోకి వెళ్లేందుకు ప్రజలు పడుతున్న ఇక్కట్లు అన్నీఇన్నీ కావు.

11 గ్రామాల ప్రజలకు ఇబ్బందులు

71వ జాతీయ రహదారిపై ఉన్న పెసల గుర్రప్పతోట నుంచి కప్పగుంటకండ్రిగ, పాలచ్చూరు తదితర 11 గ్రామాలకు వెళ్లే దారి వద్ద అండర్ పాస్ నిర్మించకపోవడంతో ప్రజలు నరక యాతన ఇబ్బందులు పడుతున్నారు. ఇదే దారిలో నిత్యం వందలాది మంది కార్మికులు మేనకూరు సెజ్‌కు రాకపోకలు సాగిస్తుంటారు. అండర్‌పాస్ లేకపోవడం, కనీసం సర్వీస్ రోడ్డు నిర్మించపోవడంతో ఆయా గ్రామాల ప్రజల ఇక్కట్లు చెప్పనలవికావు. దగ్గర్లోనే ఉన్న మండల కేంద్రానికి చేరుకోవాలన్నా కిలోమీటర్ల దూరం అదనంగా ప్రయాణించాల్సి వస్తోంది. అధికారులు స్పందించి అండర్ పాస్‌ల వద్ద ఉన్న సర్వీస్ రోడ్ల నిర్మాణం త్వరితగతిన పూర్తి చేయాలని, అదేవిధంగా తాళ్వాయిపాడు నుంచి నెలబల్లి రోడ్డు వరకు జాతీయ రహదారికి ఇరువైపులా సర్వీస్ రోడ్లు నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.

పంట పొలాలకు దారిలేదు

మండలంలో 20వేల ఎకరాల వ్యవసాయ భూములు ఉన్నాయి. ఇందులో అత్యధికంగా ఏడాదికి రెండు పంటలు పండే భూములు జాతీయ రహదారికి ఇరువైపులా ఉన్నాయి. ఈ భూముల్లో పంటలు వేసేందుకు విత్తనాలు, ఎరువులు తీసుకెళ్లేందుకు... సాగుచేసి పండించిన ఉత్పత్తులను ఇళ్లకు చేర్చుకునేందుకు రోడ్డు సౌకర్యం లేక రైతులు పడుతున్న పాట్లు వర్ణనాతీతం.

సైబర్ నేరాలపై అవగాహన పెంచుకోండి



సమావేశంలో మాట్లాడుతున్న నరసింహారావు

గూడూరు, సూళ్లూరుపేట, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి మోసపోకుండా వుండాలని హైదరాబాదుకు చెందిన సైబర్ సెక్యూరిటీ ఎక్స్‌పర్ట్ నరసింహారావు అన్నారు. బుధవారం స్థానిక నారాయణ ఇంజనీరింగ్ కళాశాలలో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో సైబర్ నేరాల నియంత్రణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోజురోజుకు సైబర్ నేరాల సంఖ్య పెరిగిపోతోందన్నారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని కొందరు దుర్వినియోగం చేస్తూ సైబర్ మోసాలకు పాల్పడుతున్నారని చెప్పారు. డీఎస్పీ రమణకుమార్ మాట్లాడుతూ సైబర్ నేరాలను నియంత్రించేందుకు పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నామన్నారు. మొబైల్ మేసేజ్‌లు, ఆన్‌లైన్ ద్వారా సైబర్ నేరాలు జరుగుతున్నాయన్నారు. లోన్లు మంజూరయ్యాయని, ఇతర రకాలుగా ఆశ చూపించి మన బ్యాంకు ఖాతా నంబర్లును తెలుసుకుని మోసాలకు పాల్పడుతున్నారన్నారు. తెలియని వ్యక్తులు ఫోన్, లేదా మేసేజ్ ద్వారా ఓటీపీలు, బ్యాంకు ఖాతా నంబర్లు అడిగితే వివరాలు చెప్పకూడదన్నారు. అవగాహన లేకపోవడం వల్ల చాలా మంది నగదు పోగొట్టుకుంటున్నారని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రవిప్రసాద్, సీఐలు కిషోర్‌బాబు, శేఖర్‌బాబు, హుస్సేన్‌బాషా, శ్రీనివాస్, ఎస్ఐ మనోజ్‌కుమార్, పవన్‌కుమార్, సురేష్‌బాబు, సుబ్రహ్మణ్యంరాజు, ఏవో కొండారెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు. ● సూళ్లూరుపేటలోని గోకులకృష్ణ ఇంజనీరింగ్ కళాశాలలో బుధవారం సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. సైబర్ క్రైమ్ నిపుణుడు ఎల్.నరసింహారావు మాట్లాడుతూ విద్యార్థులు ఆన్‌లైన్, డిజిటల్ ఫ్రాడ్స్, లోన్ యాప్‌లు, స్మార్ట్ మొబైల్ నివియోగంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను క్షుణ్ణంగా వివరించారు. కార్యక్రమంలో నాయుడుపేట డీఎస్పీ చెంచుబాబు, సూళ్లూరుపేట సీఐ మురళికృష్ణ, ఎస్ఐ బ్రహ్మానాయుడు, ప్రిన్సిపాల్ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

అవమానించారని... యువతి ఆత్మహత్య



లక్ష్మీప్రియ (ఫైల్‌ఫొటో)

నాయుడుపేట టౌన్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): నలుగురిలో తనను అవమానించారని మనస్తాపం చెందిన ఓ యువతి ఆత్మహత్య చేసుకుంది. నాయుడుపేట - శ్రీకాళహస్తి బైపాస్‌రోడ్డు సమీపంలోని సప్తగిరి కట్టకాలనీలో నివాసం ఉంటున్న అమరావతికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. అమరావతి తడలోని ఓ పరిశ్రమలో విధులు నిర్వహిస్తూ కుటుంబాన్ని పోషిస్తోంది. ఈమే చిన్నకుమార్తె లక్ష్మీప్రియ కొంత కాలంగా పట్టణంలోని ఓ సూపర్ బజార్‌లో పనిచేసేది. మూడు రోజుల క్రితం క్యాష్ కౌంటర్‌లో రూ.17,000 తగ్గాయని సూపర్ బజార్ యాజమాన్యం ప్రశ్నించడమే కాకుండా కుటుంబసభ్యులకు తెలియ జేశారు. అంతేకాకుండా సూపర్ బజార్ యాజమాన్యం పోలీసులకు తెలపడంతో లక్ష్మీప్రియను పోలీస్ స్టేషన్‌కు పిలిపించి విచారించినట్లు తెలిసింది. దీంతో మనస్తాపం చెందిన లక్ష్మీప్రియ మంగళవారం ఇంట్లోనే ఉరివేసుకొని మృతి చెందింది. అర్బన్ సీఐ బాబి సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతదేహానికి స్థానిక ప్రభుత్వ వైద్యశాలలో పోస్టుమార్టం చేయించి కుటుంబసభ్యులకు అప్పగించారు. కేసు నమోదు చేశారు. సూపర్ బజార్ యాజమాన్యం నిందించడంతో అవమాన భారంతో లక్ష్మీప్రియ ఆత్మహత్య చేసుకుందని కుటుంబసభ్యులు ఆరోపించారు.

గడ్డి మందు తాగి యువకుడి ఆత్మహత్య

చిట్టమూరు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కొక్కుపాళెం గ్రామానికి చెందిన ఇంగిలాల గిరి(37) గడ్డిమందు తాగి మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు... గత కొంతకాలంగా గిరి దంపతుల మధ్య మనస్పర్థలు చోటు చేసుకోవడంతో భార్య పుట్టింటికి వెళ్లిపోయింది. మనస్థాపానికి గురైన గిరి మంగళవారం గడ్డి మందు తాగి అపస్మారక స్థితికి చేరుకున్నాడు. గ్రామస్తులు గమనించి నెల్లూరుకు తరలించగా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేశారు.

మహిళలకు రక్షణ కల్పించడంలో ప్రభుత్వాలు విఫలం



సమావేశంలో మాట్లాడుతున్న విమల

గూడూరు, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): మహిళలకు రక్షణ కల్పించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమవుతున్నాయని ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య అధ్యక్షురాలు అత్తిలి విమల అన్నారు. బుధవారం స్థానిక డీఆర్‌డబ్ల్యు కళాశాలలో ఏఐఎస్ఎఫ్, ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళల రక్షణ కోసం చట్టాలు ఎన్ని ఉన్నా అవి సక్రమంగా అమలు జరగడంలేదన్నారు. రాష్ట్రంలో ఎక్కడో ఒక దగ్గర ప్రతిరోజూ మహిళలపై అఘాయిత్యాలు, హత్యలు, అత్యాచారాలు జరుగుతూనే ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఇటీవల చిన్నారులపై లైంగిక దాడులు, హత్యలు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. నిందితులను కఠినంగా శిక్షించి నేరాల నియంత్రణకు పటిష్ట చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో శశికుమార్, యశ్వంత్, సాయి, ప్రణయ్, కళాశాల ప్రిన్సిపాల్ హనుమంత్‌రావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నోటు పుస్తకాల పంపిణీ

సూళ్లూరుపేట, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట జడ్పీ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ నోటు పుస్తకాలు పంపిణీ చేశారు. నాయకులు, కార్యకర్తలు తనకు సన్మానాలు, సత్కారాలకు బదులుగా అందజేసిన నోటు పుస్తకాలను విద్యార్థులకు పంపిణీ చేసినట్లు ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో సుధాకర్‌రెడ్డి, రమేష్, ఏజీ కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

అదుపుతప్పి టిప్పర్ బోల్తా

గూడూరు అర్బన్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని చెన్నూరు సమీపంలో బుధవారం ఓ టిప్పరు అదుపుతప్పి పొలాల్లోకి బోల్తాపడింది. స్థానికుల వివరాల మేరకు... తిప్పవరప్పాడు నుంచి గూడూరు వైపు కంకర లోడుతో వెళ్తున్న టిప్పరు చెన్నూరు సమీపంలో అదుపుతప్పి పొలాల్లో బోల్తాపడింది. ఈ ఘటనలో డ్రైవర్‌కి స్వల్ప గాయాలయ్యాయి. అదేవిధంగా పోటుపాళెం జాతీయ రహదారి కూడలి వద్ద చెన్నై వైపు నుంచి నెల్లూరు వైపు వెళుతున్న ఓ మినీలారీ అదుపుతప్పి సర్వీస్సు రోడ్డులోకి దూసుకెళ్లింది. డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి.

టీడీపీ సభ్యత్వ నమోదు వేగవంతం చేయండి



సభ్యత్వ కార్డులను అందజేస్తున్న ఎమ్మెల్యే

సూళ్లూరుపేట, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): టీడీపీ సభ్యత్వ నమోదును వేగవంతం చేయాలని ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ అన్నారు. బుధవారం కచ్చేరివీధిలో పార్టీ పట్టణ అధ్యక్షుడు ఆకుతోట రమేష్ ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు చేపట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి బూత్‌లో కార్యకర్తలకు సభ్యత్వ నమోదు చేయించే బాధ్యత ఆయా బూత్ కన్వీనర్లదేనని అన్నారు. కార్యకర్తలకు పార్టీ సభ్యత్వ నమోదు చేయించడం వల్ల బీమాతో పాటు ఇతర ప్రయోజనాలు ఉంటాయని తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి టి.సుధాకర్‌రెడ్డి, పట్టణ కార్యదర్శి ఏజీ కిషోర్, నాయకులు మాధవ నాయుడు, అలవల శ్రీనివాసులు, పార్థసారధి, బండారు ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

తిన్నెలపూడిలో రీ సర్వే గ్రామసభ



రైతుల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న తహసీల్దారు

కోట, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని తిన్నెలపూడి సచివాలయంలో బుధవారం తహసీల్దారు జయజయరావు ఆధ్వర్యంలో భూముల రీసర్వేపై గ్రామసభ జరిగింది. పంచాయతీలోని గ్రామాల రైతులు సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. కొన్ని సమస్యలను రెవెన్యూ అధికారులు అక్కడికక్కడే పరిష్కరించారు. కార్యక్రమంలో తెలుగు మహిళా జిల్లా ఉపాధ్యక్షురాలు గండవరం సుష్మారెడ్డి, ఆర్ఐ మధుబాల, సర్వేయర్ గోపిరెడ్డి, పలువురు సర్వేయర్లు, వీఆర్వో, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

సీఎం సహాయ నిధి చెక్కు అందజేత



చెక్కు అందజేస్తున్న వేనాటి సతీష్ రెడ్డి

సూళ్లూరుపేట, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): ఇటీవల అనారోగ్యానికి గురై శస్త్రచికిత్స చేయించుకొన్న తడ మండలం గొల్లల మొలువు గ్రామానికి చెందిన గోపాలరెడ్డికి ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరైన రూ.1,38,500 చెక్కును టీడీపీ జిల్లా కార్యదర్శి వేనాటి సతీష్ రెడ్డి బుధవారం అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు అశోక్ రెడ్డి, వేనాటి జనార్దన్ రెడ్డి, రాజారెడ్డి, కాటి సుబ్రహ్మణ్యం, కేవీరెడ్డి, బుద్ది విజయలక్ష్మి, మంజుల, చంద్రయ్య సుబ్బయ్య పాల్గొన్నారు.

కల్యాణ్‌రెడ్డికి నేతల శుభాకాంక్షలు



కల్యాణ్‌రెడ్డిని సత్కరిస్తున్న టీడీపీ నాయకులు

పెళ్లకూరు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): టీడీపీ నేత, కేఆర్ ఛారిటబుల్ ట్రస్టు వ్యవస్థాపకుడు వేలూరు కల్యాణ్‌రెడ్డి జన్మదిన వేడుకలను బుధవారం మండలంలోని శిరసనంబేడు గ్రామంలో అట్టహాసంగా జరిగాయి. గ్రామంలోని సిద్దేశ్వరస్వామి ఆలయంలో టీడీపీ కార్యకర్తల నడుమ కల్యాణ్‌రెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. పేదలకు దుస్తులు, పండ్లు, విద్యార్థులకు విద్యా సామాగ్రి అందజేశారు. టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు వేలూరు మురళీకృష్ణారెడ్డి, సర్పంచు గుంటపూడి పెంచలయ్య, సుధాకర్‌రెడ్డి, కుంపటి సునీల్, సిసింద్రి తదితరులు కల్యాణ్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

సోలార్ విద్యుత్‌పై దృష్టి సారించండి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో

వెంకటగిరి టౌన్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): ప్రజలు సోలార్ విద్యుత్‌పై దృష్టి సారించాలని ఎంపీడీవో కోటేశ్వరరావు అన్నారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సోలార్ ప్యానళ్ల ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం సబ్సిడీ అందజేస్తుందన్నారు. గృహ అవసరాలకు వినియోగించాక మిగిలిన విద్యుత్‌ను అమ్ముకోవచ్చని, ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

21 మందికి పొజిషన్ సర్టిఫికెట్లు

వెంకటగిరి టౌన్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని గుండ్లసముద్రం ఎస్టీ కాలనీలో నివసిస్తున్న 21మందికి కలెక్టర్ వెంకటేశ్వర్ పొజిషన్ సర్టిఫికెట్లు గురువారం అందజేస్తారని తహసీల్దార్ రాంబాబు తెలిపారు.

వరి సాగులో వంగడాల ఎంపికే కీలకం

పెళ్లకూరు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): వరి సాగు చేయడంలో రైతులు మేలైన వంగడాలను ఎంపిక చేసుకోవాలని కృషి విజ్ఞాన్ కేంద్ర శాస్త్రవేత్త నాగార్జునరెడ్డి సూచించారు. బుధవారం మండలంలోని తాళ్వాయిపాడు, కానూరు గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉద్యానశాఖ అధికారి శారద మాట్లాడుతూ నిమ్మలో కొమ్మల కత్తిరింపులు, యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించారు. బిందు సేద్యం పరికరాలపై ప్రభుత్వం అందించే రాయితీలను వివరించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి గౌడవర్తి ప్రవీణ, సాయిల్ సెంటిస్ట్ రాజీవన, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

అధిక మోతాదు ఎరువులతో అనర్థం

ఓజిలి, నవంబరు 6: పంటలకు అధిక మోతాదులో ఎరువులు వాడితే భూసారంపై తీవ్ర ప్రభావం చూపుతుందని, ఫలితంగా రైతులు నష్టపోతారని ఏవో విజయలక్ష్మి తెలిపారు. బుధవారం మండలంలోని సగుటూరు, వీర్లగునుపాడు గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాలు నిర్వహించారు. ఆయా గ్రామాల్లో రైతులకు వివిధ పంటల సాగు, ఎరువుల వాడకం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సచివాలయ వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

నారుమడిలో యాజమాన్య పద్ధతులపై అవగాహన

కోట, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కొత్తపట్నం, సిద్ధవరం గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం జరిగింది. మండల వ్యవసాయ అధికారి నిరంజన్‌కుమార్ ఆధ్వర్యంలో నారుమడిలో యాజమాన్య పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించారు. జింక్ లోపాన్ని ఎలా నివారించాలో ప్రయోగాత్మకంగా వివరించారు. కేఎన్ఎం, ఆర్ఎన్ఆర్ రకం వరి విత్తనాలు రైతు సేవాకేంద్రాల్లో రాయితీపై అందజేస్తున్నట్లు ఏవో తెలిపారు.

ఎరువుల యాజమాన్యమే కీలకం

వాకాడు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): వరి పంట సాగులో నారుమడుల నుంచి దిగుబడి వచ్చేవరకు మెలుకువలు పాలటించాలని వ్యవసాయ అధికారి దీప అన్నారు. బుధవారం ఆమె మాట్లాడుతూ వరిసాగులో నీటి యాజమాన్యంతో పాటు ఎరువులు, పురుగుమందుల వినియోగం కీలకమన్నారు. భూసార పరీక్షల ఫలితాలకు అనుగుణంగా ఎరువులను వాడినప్పుడే మంచి ఫలితాలు వస్తాయన్నారు. ఎకరాకు 25 కిలోల నత్రజని, 16 కిలోల భాస్వరం, 12 కిలోల పోటాష్ లభించే ఎరువులను మాత్రమే ఉపయోగించాలని, అంతకుమించి వాడితే పంటను తెగుళ్లు ఆశించే ప్రమాదం ఉందన్నారు.

నైపుణ్య గణన సర్వేపై శిక్షణ

వాకాడు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని స్త్రీశక్తి భవనంలో బుధవారం నైపుణ్య సర్వేపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీవో అన్నపూర్ణరావు మాట్లాడుతూ సచివాలయ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి 8 అంశాలపై సర్వే చేపట్టి సమగ్ర నివేదిక అందజేయాలన్నారు. అనంతరం స్కిల్ డెవలప్‌మెంట్ కోఆర్డినేటర్ జశ్వంత్ నైపుణ్య సర్వేలోని వివిధ అంశాలపై సచివాలయ సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ఈవోపీఆర్‌డీ ఉమా మహేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌బీకేఆర్‌లో బూత్‌క్యాంప్‌పై శిక్షణ తరగతులు

కోట, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని విద్యానగర్ ఎన్‌బీకేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో విద్యార్థులకు బూత్‌క్యాంప్‌పై రెండు రోజుల శిక్షణ తరగతులను కళాశాల డైరెక్టర్ డాక్టర్ విజయకుమార్‌రెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు.

కార్మికులకు న్యాయం చేయండి

నాయుడుపేట, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): నాయుడుపేట - మేనకూరు సెజ్‌లోని లాయల్ టెక్స్‌టైల్ యాజమాన్యం దిష్టిబొమ్మను కార్మికులు, సీఐటీయూ నాయకులు దగ్ధం చేశారు. సీఐటీయూ నాయకుడు ముకుంద మాట్లాడుతూ కార్మికులకు చట్టపరమైన రాయితీలు ఇవ్వకుండా కర్మాగారాన్ని మూసివేసి ఉద్యోగుల కడుపుకొట్టడం సబబుకాదన్నారు. కార్మికులు సంబంధిత ప్రభుత్వ అధికారుల వద్దకు వెళ్లి నెలల తరబడి వినతిపత్రాలు ఇస్తున్నా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి కార్మికులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కర్మాగార కార్మికులు రత్నమ్మ, దీప, శివ, సుగుణమ్మ తదితరులు పాల్గొన్నారు.